



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 66 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 17 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 66 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 17 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా

- "నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను
- ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ
- బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం
- పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం
- జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం.
- ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం
- ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:**పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ. జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం కొట్లా డారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతి నిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలా బాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాలి. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని

వివరాలు 2లో..



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

- హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి
- మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి
- మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో

వివరాలు 2లో..



## డ్యూటీ ఎక్కేందుకు ససేమిరా అన్న ఇండిగో పైలట్

- విమానం నిలిచిపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం
- ముంబై-థాయ్‌లాండ్ ఇండిగో ఫ్లైట్‌లో తీవ్ర గందరగోళం
- డ్యూటీ సమయం ముగియడంతో విమానం నడిపేందుకు పైలట్ నిరాకరణ
- సిబ్బందితో వాగ్వాదం.. విమానం డోర్‌ను తన్నిన ప్రయాణికులు
- అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరిని దించివేసిన ఇండిగో సిబ్బంది
- ఆలస్యంగా గమ్యస్థానానికి చేరిన విమానం

వివరాలు 2లో..



## 20న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించనున్న బీజేపీ

- ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు
- బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను రిలీజ్
- ఒకవేళ అవసరం అయితే పోలింగ్ 20వ తేదీన నిర్వహించనున్నారు

వివరాలు 2లో..

## కేఏపాల్‌కు అరుదైన గౌరవం

- అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్ సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు
- గ్లోబల్ పీస్ అంబాసిడర్ హోదాలో ఆహ్వానం అందుకున్న కేఏపాల్
- కాన్సాస్ సెనేట్ లో కేఏ పాల్ ప్రత్యేక ప్రసంగం...
- ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు.. యుద్ధాలన్నీ వెంటనే ఆగిపోవాలన్న పాల్
- భారత్, అమెరికా మధ్య బంధాలు బలోపేతం కావాలని ఆకాంక్ష

వివరాలు 2లో..



## భారీగా సొత్తు స్వాధీనం!

- ధరణీ, భూభారతి కుంభకోణంలో 15 మంది అరెస్ట్..
- మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు
- సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్స్, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం
- జనగామ జిల్లాలో 7 కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు




**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో సంచలం సృష్టించిన ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్ల అక్రమాలకు పాల్పడిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి రూ. 3.90కోట్ల కుంభకోణంలో నిందితులుగా ఉన్న 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. మరో తొమ్మిది మంది పరారీలో

వివరాలు 2లో..

## స్పీకర్‌పై సుప్రీం గరం గరం

- స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం..
- ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం
- అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలి
- తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా
- ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, ఇది చివరి అవకాశం
- ఇకపై నిర్ణయం తీసుకోకుంటే తీవ్రంగా వ్యవహారించాల్సి వస్తుందని ధర్మాసనం స్పష్టం



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యే ఫిరాయిం పులపై చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్కు సమయం ఇచ్చినా, ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇవాళ విచారణ చేపట్టిన ధర్మాసనం అసెంబ్లీ స్పీకర్‌కు మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, ఇది చివరి అవకాశమని పేర్కొంది. ఇకపై నిర్ణయం తీసుకో కుంటే

వివరాలు 2లో..



## స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..

- దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- 'స్టార్టప్ ఇండియా' మిషన్‌కు పదేళ్లు పూర్తి
- దేశ యువత నిజమైన సమస్యలను పరిష్కరిస్తోందన్న మోదీ
- పదేళ్లలో 500 నుంచి 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు
- 125కు పైగా యూనికార్న్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరిగిందన్న ప్రధాని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మేటి నటి శాంతకుమారి

తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి. తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్‌టి రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు. ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించి వందకు పైగా సినిమాల్లో నటించారు. శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాస్‌లో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె.పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిండియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు. సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక - నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట - గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్టపాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసుకొన్న తరువాతకూడ ఆమె నట జీవితం సాఫీగా కొన సాగింది. శాంతకుమారి పి.పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు. శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు. శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేబీ లక్ష్మి, ఆరణి సత్యనారాయణ మొదలైన వారు నటించారు. హను మంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు. పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయోగించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), మరియు ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధంగి 'జయభేరి, ప్రేమ్‌నగర్' ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించడం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు.మాయాబజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937), భక్తజయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్ట బుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957), జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968), అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు. 1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు. తెలుగు వెండి తెర బామ్మ 86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006 న స్వగృహంలో మృతి చెందారు.

## డ్యూటీ ఎక్కేందుకు ససేమిరా అన్న ఇండిగో పైలట్

ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని క్రాబీకి వెళ్లాల్సిన ఇండిగో విమానంలో గురువారం తీవ్ర గందరగోళం నెలకొంది. తన డ్యూటీ సమయం ముగిసిపోవడంతో విమానాన్ని నడిపేందుకు పైలట్ నిరాకరించడమే ఇందుకు కారణం. దీంతో గంటల తరబడి విమానం కదలకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే, ఇండిగో ఫ్లైట్ 6జు 1085 గురువారం ఉదయం 4:05 గంటలకు ముంబై నుంచి బయలుదేరాల్సి ఉంది. అయితే, మరో విమానం ఆలస్యంగా రావడం, ఎయిర్ ట్రాఫిక్ రద్దీ వంటి కారణాలతో ఇది ఇప్పటికే మూడు గంటలకు పైగా ఆలస్యమైంది. ప్రయాణికులను విమానంలోకి ఎక్కించిన తర్వాత కూడా టేకాఫ్ కాకపోవడంతో వారి సహనం నశించింది. డ్యూటీ సమయం ముగిసిందని పైలట్ చెప్పడంతో వారు సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. సోషల్ మీడియా వీడియోల ప్రకారం, కొందరు ప్రయాణికులు "పైలట్ ఎలుకలా ఎందుకు దాక్కుంటున్నాడు?" అని అరవగా, మరొకరు విమానం డోర్‌ను కాలితో తన్నుతూ కనిపించారు. పైలట్‌పై దాడి చేయాలంటూ కొందరు మాట్లాడుకోవడం కూడా కలకలం రేపింది. ఈ ఘటనపై ఇండిగో సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భద్రతా నిబంధనల ప్రకారం పైలట్ డ్యూటీ సమయం ముగియడంతో విమానం నడపలేదని స్పష్టం చేసింది. వేచి ఉన్న సమయంలో ప్రయాణికులకు ఆహారం, ఇతర సదుపాయాలు అందించామని పేర్కొంది. అయితే, అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు ప్రయాణికులను విమానం నుంచి దించివేసి భద్రతా సిబ్బందికి అప్పగించినట్లు తెలిపింది. ఈ ప్రక్రియ వల్ల విమానం మరింత ఆలస్యమైంది. చివరికి ఆ విమానం మధ్యాహ్నం 1 గంట సమయంలో క్రాబీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో విచారం వ్యక్తం చేసింది.

# కేఏపాల్‌కు అరుదైన గౌరవం

**న్యూఢిల్లీ :** కిలారి ఆనంద్ పాల్ ఇక్కడ కామెడీగా రాజకీయాలు చేస్తారు కానీ ఆయన అమెరికాలో చాలా సీరియస్‌గానే ఉంటారు. తాజాగా ఆయనకు అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్ సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గ్లోబల్ పీస్ అంబాసిడర్ హోదాలో ఆహ్వానం అందుకున్న ఆయన, సభలో ప్రపంచ శాంతి స్థాపన కోసం గళమెత్తారు. భారత్ , మెరికా దేశాలు ప్రపంచానికి రెండు కళ్ల వంటివని, ఈ రెండు అగ్రదేశాలు సమన్వయంతో ముందుకెళ్తేనే విశ్వవ్యాప్తంగా శాంతి నెలకొంటుందని ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న 58 యుద్ధాల పట్ల కె.ఎ. పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాల కారణంగా కోట్లాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, ట్రిలియన్ల కొద్దీ డాలర్ల ప్రజా ధనం వృధా కావడం మానవాళికి తీరని నష్టమని ఆయన సెనేట్ సభ్యులకు వివరించారు. ఈ విధ్వంసం ఆగిపోవాలని, దేశాల మధ్య వైషమ్యాలు తొలగిపోవాలని కోరుతూ ఆయన సెనేట్ సాక్షిగా ప్రత్యేక శాంతి ప్రార్థన చేశారు. యుద్ధాలకు వెచ్చించే వనరులను పేదరిక నిర్మూలనకు, అభివృద్ధికి మళ్లించాలని ఆయన కోరారు.భారత్-అమెరికా దేశాల మధ్య మైత్రి మరింత బలపడాల్సిన అవసరాన్ని పాల్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రపంచ శాంతిని కాపాడటంలో రెండు దేశాలు కలిసికట్టుగా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. అమెరికా లాంటి అగ్రరాజ్యాల చట్టసభల్లో భారతీయుడిగా శాంతి సందేశాన్ని వినిపించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మిక , రాజకీయ నాయకుడిగా ఆయన చేస్తున్న కృషిని గుర్తించి సెనేట్ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.

### గ్లోబల్ పీస్ మిషన్ అధ్యక్షుడిగా కేఏ పాల్

డాక్టర్ కె.ఎ. పాల్ స్థాపించిన గ్లోబల్ పీస్ మిషన్ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. గత మూడు దశాబ్దాలకు పైగా ఈ మిషన్ ద్వారా ఆయన అనేక దేశాల అగ్రనేతలు, ప్రెసిడెంట్లు, ఆధ్యాత్మిక గురువులతో కలిసి శాంతి చర్చలు జరుపుతున్నారు. ముఖ్యంగా అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్న ఆఫ్రికా దేశాల్లోనూ, మధ్యప్రాచ్య దేశాల్లోనూ శాంతిని నెలకొల్పేందుకు ఈ మిషన్ కీలక పాత్ర పోషించింది. ఐక్యరాజ్యసమితి వంటి వేదికల ద్వారా యుద్ధాల వల్ల జరిగే ప్రాణ, ఆస్తి నష్టాలను వివరిస్తూ, దేశాల మధ్య వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఈ మిషన్ నిరంతరం ప్రచారం చేస్తోంది. ఈ మిషన్ కేవలం శాంతి చర్చలకే పరిమితం కాకుండా, భారీ స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. చారిటీ సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు తక్షణ సహాయం అందించడం ఈ సంస్థ చేస్తుంది. ప్రపంచంలోని 58 దేశాల్లో జరుగుతున్న ప్రస్తుత యుద్ధాలను ఆపివేసి, ఆ నిధులను ప్రపంచ ఆకలి కేకల నిర్మూలనకు మళ్లించాలన్నది గ్లోబల్ పీస్ మిషన్ ప్రధాన ఆశయం.

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలన్నీ వెంటనే ఆగిపోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 58 ప్రధాన యుద్ధాలు జరుగుతున్నాయని, వీటి వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, ట్రిలియన్ల డాలర్లు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్ (అసెంబ్లీ)లో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలను శాశ్వతంగా నిర్మూలించడంతోనే శాంతి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని పాల్ అన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇరు దేశాలు కలిసి నాయకత్వం వహించాలని చెప్పారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో భారత్, అమెరికాలు కీలక పాత్ర పోషంచగలవని అన్నారు.

# స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..

భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు. పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని స్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి.

### అందరినీ కలుపుకొని వృద్ధి

స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నా యనడానికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు స్టార్టప్‌లను వైఫల్యానికి దారితీసే మార్గంగా, కేవలం సంపన్నుల పిల్లలకే పరిమితమైనవిగా చూసేవారని, కానీ స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఈ దృక్పథాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు. "నా ముందు కొత్తగా ఆవిర్భవిస్తున్న భారత్ భవిష్యత్తు కనిపిస్తోంది" అని స్టార్టప్ వ్యవస్థాపకులను ఉద్దేశించి మోదీ అన్నారు. "మీ కలలే ఈ దేశ ప్రగతికి చోదక శక్తి" అని కొనియాడారు.

### భవిష్యత్ లక్ష్యం తయారీ రంగం

డిజిటల్ స్టార్టప్‌లు, సేవా రంగంలో మనం అద్భుతమైన విజయం సాధించామని, ఇప్పుడు తయారీ రంగంపై కూడా మన స్టార్టప్‌లు మరింత దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్న మైందని ప్రధాని పిలుపునిచ్చారు. "ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతతో కొత్త ఉత్పత్తులను తయారు చేయాలి. సాంకేతిక తలోనూ మనం ప్రత్యేకమైన ఆలోచనలతో ముందంజ వేయాలి. మీ ప్రతి ప్రయత్నంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని నేను హామీ ఇస్తున్నాను" అని మోదీ భరోసా ఇచ్చారు. ఈ వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును గుర్తుచేస్తూ, 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్' 'క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్' 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్' వంటి పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. జాతీయ స్టార్టప్‌ల దినోత్సవం మన ప్రజల ధైర్యం, ఆవిష్కరణల స్ఫూర్తి, వ్యవస్థాపక ఉత్సాహానికి ప్రతీక అని ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# భారీగా సొత్తు స్వాధీనం!

-మొదటిపేజీ తరువాయి

ఉన్నారు తెలిపారు. ఈ ముఠా సభ్యుల నుంచి రూ.63.19 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.1లక్ష, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్స్, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ధరణి, భూ భారతీ కుంబకోణంతో సంబంధమున్న 15 మందిని పోలీసులు అరెస్టు చేసి వారి వివరాలు వెల్లడించారు. అరెస్టైన వారిలో 1.పసునూరి బసవ రాజు, వయసు: 32 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా), 2. జెల్లా పాండ, వయసు: 46 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా) 3. మహేశ్వరం గణేష్ కుమార్, వయసు: 39 సంవత్సరాలు (యాదాద్రి జిల్లా) 4. గాజులపాటి శ్రీనాథ్, వయసు: 35 సంవత్సరాలు (జనగామ), 5. యెనగంధుల వెంకటేష్, (జనగామ), 6. కోదురి శ్రావణ్ వయసు: 35 సంవత్సరాలు (జనగామ), 7. కొలిపాక సతీష్ కుమార్ వయసు: 36 సంవత్సరాలు, కొడకండ్ల (ఎం), జనగామ. 8. తడూరి రంజిత్ కుమార్ వయసు 39 సంవత్సరాలు, నర్మెట్ట, జనగామ. 9. దుంపల కిషన్ రెడ్డి, వయసు: 29 సంవత్సరాలు, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, 10. దశరథ మేఘావత్ వయసు: 28 సంవత్సరాలుతు రుపల్లి. 11. నారా భాను ప్రసాద్, వయసు: 30 సంవత్సరాలు, యాదగిరిగుట్ట, 12. గొపగాను శ్రీనాథ్, వయసు: 32 సంవత్సరాలు, శివ కుమార్, వయస్సు 33, అమంగల్, నల్లగొండ. 13. ఒగ్గు కర్నాకర్, వయసు: 42 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా. 14. కమల్ల 15. అలేటి నాగరాజు, వయస్సు 32, (యాదాద్రి జిల్లా)కు చెందిన వారు ఉన్నారని పోలీసులు గుర్తించారు. భారీ కుంభకోణానికి పాల్పడిన నిందితులు వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను మీడియాకు వెల్లడించారు. 'ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్లలో ఆన్‌లైన్ సర్వీస్ నిర్వహించేవారు. నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను ఆన్‌లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చెల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా ద్వారా పే చేస్తానని నమ్మించి.. రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించేవాడు. అలా వసూలు చేసిన డబ్బును ఆన్‌లైన్ సర్వీస్ వ్యక్తులకు, మధ్యవర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఈ చలాన్లను ప్రధాన నిందితుడికి పంపిచేవాడు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు ధరణీ/భూభారతీ వెబ్‌సైట్లో ఇన్‌స్పెక్ట్ " ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చలాన్ల రుసుము తగ్గించేవాడు. అనంతరం అట్టి ఛలాన్‌ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడు. ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగించి ప్రభుత్వానికి చెల్లించిన రుసుముకు సంబంధించి వెబ్‌సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసేవారు. అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి.. నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మధ్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మధ్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్‌సైట్లో నమోదు చేసేవారు. ఇందుగాను మిగితా వారికి 10 శాతం నుండి 30 శాతం వరకు కమీషన్ చెల్లించేవారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబంధించిన లావాదేవీల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదయ్యాయి. జనగామ జిల్లాలో 7 కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు రిజిష్టర్ అయ్యాయ'ని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కీలకమైన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరీ చేతన్. జనగామ ఇన్‌స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# స్పీకర్‌పై సుప్రీం గరం గరం

-మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా వ్యవహరించాల్సి వస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా వింటర్ వెకేషన్ తరువాత తొలిసారి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం విచారణ చేపట్టింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం ఈ కేసును విచారించింది. మరోవైపు 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఏడుగురిపై అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా జనవరి 15న పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యల ఫిరాయింపులపై పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. వీరిపై పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఈ ఇద్దరిని ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇంతకుముందు మరో ఐదుగురిపై వచ్చిన పిటిషన్లను స్పీకర్ కొట్టి పారేశారు. తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నానని.. తన వేతనం నుంచి ప్రతినెలా 5వేల రూపాయలు.. బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఖర్చుల కోసం స్వీకరిస్తోందని స్పీకర్కి ఎమ్మెల్యేలు తెలిపారు. అంతేకాదు, తానెక్కడా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనలు ఉల్లంఘించలేదని స్పీకర్కి వివరణ ఇచ్చారు. గతేడాది నవంబర్ నెలలో ఈ కేసును విచారించింది సుప్రీంకోర్టు.. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి నాలుగు వారాల గడువు కూడా ఇచ్చింది. అనర్హత పిటిషన్లపై ఈలోపే నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ని ఆదేశించింది సుప్రీం కోర్టు. నవంబర్ వాయిదా తర్వాత మళ్లీ ఇప్పుడు సుప్రీంలో విచారణకు వచ్చింది. అయితే ఇప్పటికే, ఏడుగురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ క్లీన్చిట్ ఇవ్వడం.. ముగ్గురు ఎమ్మెల్యేలపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు సీరియస్గా రియాక్ట్ అయ్యింది. స్పీకర్ కంటి ఆపరేషన్ చేయించుకున్నారని.. అలాగే సెక్రటరీ జనరల్ మారారని తెలిపారు. దీనివల్ల జాప్యం జరుగుతోందని.. ద

మిగిలిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని తెలిపింది. స్పీకర్‌కు చివరి అవకాశం ఇస్తున్నామని.. రెండు వారాల్లో మిగతా ఎమ్మెల్యేలపై కూడా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

-మొదటిపేజీ తరువాయి

దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.

## తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా

-మొదటిపేజీ తరువాయి

ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళు_న్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తా. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగింది. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారింది. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారు" అని సీఎం అన్నారు.

## 20న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించనున్న బీజేపీ

**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20వ తేదీన పార్టీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను రిలీజ్ చేశారు. జనవరి 19వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య నామినేషన్ దాఖలు చేసుకోవాలి. ఇక సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ అవసరం అయితే పోలింగ్ 20వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజే కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామన్నారు. అయితే పార్టీ వర్గాల ప్రకారం ప్రస్తుతం బీజేపీ జాతీయ తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబిన్ ఆ పదవిని గెలుచుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జేపీ నడ్డా స్థానంలో నబిన్ ఆ బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. నితిన్ నబిన్‌కు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అండ ఉన్నది.

# ఘనంగా జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జైపాల్‌రెడ్డి స్మారకం.. స్ఫూర్తిస్థల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కోదండరెడ్డి, ఇ.అనిల్, చిన్నారెడ్డి, కోదండరాం, పలువురు ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, అభిమానులు ఉన్నారు.




# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

చైనా మాంజా నియంత్రణపై సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ ప్రచారం..




# చైనా మాంజాతో..! ప్రజల ప్రాణాలు తీయొద్దు..!

- పర్యావరణ ప్రేమికుడు, సామాజిక వేత్త కోలా రవిందర్ వినూత్న ప్రచారం..
- ప్రాణాల కంటే పైసా గొప్పదా..? స్కూటీపై రోడ్డెక్కిన రవీందర్ ముదిరాజ్ హెచ్చరిక..!

సంక్రాంతి పండుగరోజు ఆనందం కోసం, చైనా మాంజాను వినియోగించి.. ప్రజల ప్రాణాలు బలి తీసుకోవద్దని, స్కూటీపై వాడవాడలా వినూత్న ప్రచారం చేసిన పర్యావరణ సామాజిక వేత్త రవీందర్ ముదిరాజ్‌ను పలువురు అభినందిస్తున్నారు.. రవిందర్ ముదిరాజ్ ఇప్పటికే పలు సామాజిక కార్యక్రమాలు అందరికీ తెలిసిందే.. కరోనా సమయంలోనూ ఆయన సేవా కార్యక్రమాల సంగతి పాఠకులకు విదితమే.. చెరువుల్లో, నదులలో పడి ఈత (స్విమ్మింగ్) రాక మృతి చెందిన ఘటనలపై నేటికీ ఓ పోరాటమే చేస్తున్నారు.. ఈతను (స్విమ్మింగ్) పాఠ్యాంశంగా చేర్చి, విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని, స్థానిక ఎమ్మెల్యేలతో పాటు, అధికారంలో ఉన్న ప్రతి మంత్రులకు ఎన్నో వినతిపత్రాలు, సమర్పించినా ప్రయోజనం శూన్యం.. ఎవరూ స్పందించకఅబశ్రీశ్రీ నేటికీ పోరాటం కొనసాగుతున్న వైనం.. ఈ నిషేధిత చైనా మాంజా ఎంత ప్రమాదకరమో ప్రతియేటా రవిందర్ ముదిరాజ్ అవగాహన కల్పించినా ప్రజలు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చెందిన ఘటనలు ఉన్నాయి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 16:**




- చైనా మాంజా నిషేధంపై వినూత్న ప్రచారం చేపట్టిన సామాజిక వేత్త కోల రవీందర్..
- స్కూటీపై బ్యానర్, మైకుసెట్‌తో వాడవాడలా తిరుగుతూ ప్రజలకు అవగాహన..
- గతంలో పోలీస్, మిలిటరీ అధికారుల మృతి, పలువురికి చేతులు, కాళ్లు తెగిన ఘటనలు..
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినా.. దొంగచాటుగా విక్రయాలు..
- చైనా మాంజా విక్రయించినా, కొనుగోలు చేసినా జైలు శిక్ష తప్పదని స్పష్టీకరణ..




చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రాణనష్టాలు, అవయవాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పర్యావరణ ప్రేమికుడు, సామాజిక వేత్త కోల రవీందర్ ముదిరాజ్ వినూత్న అవగాహన ప్రచారానికి శ్రీకారం చుట్టారు.. తన స్కూటీపై బ్యానర్లు కట్టుకొని, ముందు భాగంలో రెండు పైపులు అమర్చుకుని, మన గొంతులు, చేతులు కోసుకోకుండా జాగ్రత్త పడాలి అన్న సందేశాన్ని ప్రజలకు తెలియజేస్తూ వాడవాడలా తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు.చైనా మాంజా వాడకం వల్ల గతంలో పోలీస్ అధికారులు, మిలిటరీ అధికారి మృతి ఘటనలను ఆయన వివరించారు..స్థానికంగా పలువురు చేతులు, కాళ్లు తెగిపోవడం వంటి ఘోర ప్రమాదాలు చోటుచేసుకున్నాయని రవీందర్ ముదిరాజ్ గుర్తు చేశారు. ఈ ప్రమాదాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం చైనా మాంజాపై సంపూర్ణ నిషేధం విధించి, ముమ్మర తనిఖీలు చేపట్టిందని తెలిపారు. అయినప్పటికీ కొందరు, డబ్బే లక్ష్యంగా వ్యాపారంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు.. దొంగచాటుగా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.. చైనా మాంజా విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం నేరమేనని,విక్రేతలకు, కొనుగోలుదారులకు తప్పనిసరిగా జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.చైనా మాంజా విక్రయిస్తున్న వారు ఎవరైనా కనబడితే స్థానిక పోలీసులకు లేదా తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతుందని భరోసా ఇచ్చారు.. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు కూడా ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.. చైనా మాంజా వద్దు- సురక్షితమైన పండుగలు మాత్రమే కావాలనే నినాదంతో రవీందర్ ముదిరాజ్ చేపట్టిన ఈ వినూత్న ప్రచారం ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తోందని స్థానికులు ప్రశంసిస్తున్నారు

యంత్రాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి..



# స్వచ్ఛ భారత్ యాత్రలో.. చక్రాలపై సుస్థిర అభివృద్ధి

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వ్యర్థాల సంచార వాహనాన్ని పరిశీలించిన కలెక్టర్ మను..

స్వచ్ఇకో యంత్రం గురించి వివరిస్తుండగా, కలెక్టర్ పరిశీలన..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 16:** మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా కేంద్రంగా, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 'చక్రాలపై సుస్థిర అభివృద్ధి' లక్ష్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన వ్యర్థాల వికేంద్రీకృత ప్రక్రియ సంచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పరిశీలించారు.. జనవరి 11 నుంచి ఫిబ్రవరి 15, 2026 వరకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో 'స్విచ్ఈకో' సంస్థ ఈ యాత్రను నిర్వహిస్తోంది.. ఈ సందర్భంగా శుక్రవారం మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి కలెక్టర్ మను సంచార వాహనంలో అమర్చిన సుస్థిర వ్యర్థ నిర్వహణ విధానాలను పరిశీలించారు.. ఈ సంచార వాహనంలో ప్లాస్టిక్ సీసాల కుదింపు యంత్రం (బేలింగ్ యంత్రం) మహిళా శుభ్రత ప్యాడ్లను నశింపజేసే ఇన్సినరేటర్, జీవ వ్యర్థాల కంపోస్టు తయారీ (బయో కంపోస్టింగ్) వంటి ఆధునిక, సృజనాత్మక ప్రక్రియలు అమర్చినట్లు స్విచ్ఈకో బృందం జిల్లా అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి వివరించారు.. వ్యర్థాలను మూల స్థాయిలోనే నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఈ విధానం ఎలా దోహదపడుతుందో అవగాహన కల్పించారు.. అనంతరం కలెక్టరేట్ ఉద్యోగులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.. ఈ స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా ప్రతిరోజూ సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణించి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తామని, అలాగే ఈ ప్రత్యేక సంచార వాహనాన్ని "ప్లాస్ట్ ఇండియా2026 అంతర్జాతీయ ప్లాస్టిక్స్ ప్రదర్శన, సదస్సు, సమావేశంలో ప్రదర్శనకు ఉంచనున్నట్లు స్విచ్ఈకో బృందం వెల్లడించింది.. వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం పెంచడమే లక్ష్యంగా చేపట్టిన ఈ యాత్ర, స్వచ్ఛతసుస్థిర అభివృద్ధి దిశగా ఒక కీలక మైలురాయిగా నిలుస్తోందని అధికారులు అభిప్రాయపడ్డారు..



- మేడ్చల్ కలెక్టరేట్‌కు చేరిన 'సుస్థిర అభివృద్ధి' సంచార వాహనం..
- స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో సంచార వాహన ప్రదర్శన..
- జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పరిశీలించారు..
- ప్లాస్టిక్ సీసాల కుదింపు, సానిటరీ ప్యాడ్ల ఇన్సినరేటర్, జీవ వ్యర్థాల కంపోస్టింగ్ సౌకర్యం..
- యంత్రాల నిర్వహణ విధానంపై అవగాహన. కలెక్టరేట్ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ..
- జనవరి 11 నుంచి ఫిబ్రవరి 15, 2026 వరకు స్విచ్ఈకో ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ యాత్ర.
- రోజూ 40 కిలోమీటర్లు ప్రయాణించి ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ..
- ప్లాస్ట్ ఇండియా2026 అంతర్జాతీయ ప్రదర్శనలో సంచార వాహనం ప్రదర్శనకు సిద్ధం.

# సంక్రాంతి ప్రత్యేక ఆకర్షణగా..! పతంగులపై నేతల ఫోటోలు..!

- ఎన్ఎస్‌యుఐ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కార్యక్రమం..
- చైనా మాంజా నిషేధానికి, సాయికుమార్ పటేల్ వినూత్న ప్రచారం, ప్రజల్లో చైతన్యం..



- కుత్బుల్లాపూర్‌లో ఎన్ఎస్‌యుఐ మాజీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వినూత్న ప్రయత్నం..
- కాంగ్రెస్ మంత్రి, ఎమ్మెల్సీల ఫోటోలతో ప్రత్యేకంగా రూపొందించిన గాలిపటాలు..
- ఐటి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ వెంకట్ చేతుల మీదుగా గాలిపటాల ఆవిష్కరణ..
- చైనా మాంజా నిషేధంపై స్పష్టమైన సందేశం.. విద్యార్థి నాయకుని అవగాహన కార్యక్రమం..
- సంక్రాంతి పండుగను సామాజిక చైతన్యంతో మేళవించిన వినూత్న పతంగులు..

-4 లో

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పతంగుల ఆవిష్కరణ..



# సంక్రాంతి ప్రత్యేక ఆకర్షణగా..!

# పతంగులపై నేతల ఫోటోలు..!

- ఎన్ఎస్‌యుఐ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కార్యక్రమం..
- చైనా మాంజా నిషేధానికి, సాయికుమార్ పటేల్ వినూత్న ప్రచారం, ప్రజల్లో చైతన్యం..



- కుత్బుల్లాపూర్‌లో ఎన్ఎస్‌యుఐ మాజీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వినూత్న ప్రయత్నం..
- కాంగ్రెస్ మంత్రి, ఎమ్మెల్సీల ఫోటోలతో ప్రత్యేకంగా రూపొందించిన గాలిపటాలు..
- ఐటి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ వెంకట్ చేతుల మీదుగా గాలిపటాల ఆవిష్కరణ..
- చైనా మాంజా నిషేధంపై స్పష్టమైన సందేశం.. విద్యార్థి నాయకుని అవగాహన కార్యక్రమం..
- సంక్రాంతి పండుగను సామాజిక చైతన్యంతో మేళవించిన వినూత్న పతంగులు..



ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేతుల మీదుగా గాలిపటాల ఆవిష్కరణ..

జగద్గిరిగుట్ట ప్రజల నుంచి మంచి స్పందన, యువత చురుకైన భాగస్వామ్యం, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు పంతుల సాయికుమార్ పటేల్ ఆధ్వర్యంలో విజయవంతమైన పతంగుల పంపిణీ కార్యక్రమం.. సంక్రాంతి సంబరాల్లో "భద్రతే-బాధ్యత" అనే అంశాలను ముందుకు తీసుకొచ్చిన ఈ గాలిపటాల పంపిణీ కార్యక్రమం, రాజకీయ ప్రచారానికి మించి, సామాజిక సందేశాన్ని బలంగా చాటి చెప్పిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 16:**



జగద్గిరిగుట్టలో సాయికుమార్ పంతుల అండ్ టీమ్ ఆధ్వర్యంలో ప్రజలకు పతంగుల పంపిణీ..



జగద్గిరిగుట్టలో పతంగుల పంపిణీలో స్థానిక ప్రజలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలో మాజీ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుని ఆధ్వర్యంలో సంక్రాంతి సందడి చేశారు.. కాంగ్రెస్ నేతల ఫోటోలతో ప్రత్యేకంగా తయారు చేయించిన, గాలిపటాలు ఆకర్షణగా నిలిచాయి.. మరోవైపు చైనా మాంజాకు నో చెపుతూ, దాని ప్రభావం ప్రాణాంతకమని పలు ఆధారాలతో, తెలియజేశారు.. గాలిపటాలు ఎగురవేసే క్రమంలో జాగ్రత్తలపై, సలహాలు సూచనలు చేస్తూ పతంగులు పంపిణీ చేశారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సంక్రాంతి పండుగను ప్రజలతో కలిసి ఆనందంగా జరుపుకుంటూనే, సామాజిక బాధ్యతను గుర్తుచేసేలా చైనా మాంజా నిషేధంపై అవగాహన కల్పించే వినూత్న కార్యక్రమం జగద్గిరిగుట్టలో నిర్వహించారు.. ఎన్ఎస్‌యుఐ మాజీ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, టీపీసీసీ రాష్ట్ర నాయకులు పంతుల సాయికుమార్ పటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన గాలిపటాల పంపిణీ కార్యక్రమం స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రజలకు పంపిణీ చేసిన గాలిపటాలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, చైనా మాంజా వల్ల జరిగే ప్రమాదాలు, పక్షులుమనుషుల ప్రాణాలకు కలిగే ముప్పుపై స్పష్టమైన సందేశాన్ని మోసుకొచ్చేలా ఉంది.. "సురక్షితమైన పండుగ బాధ్యతాయుతమైన ఆనందం" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు సాయికుమార్ తెలిపారు..

## పతంగులపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ వెంకట్..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన, పంతుల సాయికుమార్ పటేల్, విద్యార్థి దశనుండే ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకత్వంలో చురుకుగా పనిచేశారు.. నాటి నుండి నేటి వరకు అదే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వీరాభిమాని కూడా.. అయితే సంక్రాంతి పండుగ సందర్భంగా, సాయికుమార్ పటేల్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫోటోలతో ప్రత్యేకంగా గాలిపటాలను తయారు చేయించారు.. ఈ గాలిపటాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బల్మూరు వెంకట్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు.. సంక్రాంతి పండుగ సందర్భంగా జగద్గిరిగుట్టలో ప్రజలకు పంపిణీ చేసినట్టు సాయికుమార్ పటేల్ తెలిపారు.. ఈ సందర్భంగా పంతుల సాయికుమార్ పటేల్ మాట్లాడుతూ,"సంక్రాంతి అంటే ఆనందం, సంప్రదాయం. కానీ ఆ ఆనందం ఎవరి ప్రాణాలకు ముప్పుగా మారకూడదు.. చైనా మాంజా వలన ప్రతి సంవత్సరం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే యువత ముందుకు వచ్చి, ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో అశోక్, చంద్రకాంత్, రఘు, సంతోష్, సమీర్, రాజేష్, భరత్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజా పండుగను సామాజిక చైతన్యంతో మేళవిస్తూ, చైనా మాంజా నిషేధంపై స్పష్టమైన సందేశం ఇచ్చిన ఈ గాలిపటాల పంపిణీ కార్యక్రమం, జగద్గిరిగుట్టలో సంక్రాంతి వేడుకలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.



ఏసిపి వెంకట్‌రెడ్డి..




అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి డిఆర్వో, పోలీస్ అధికారులు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం..

# రోడ్డు భద్రత ప్రమాణాలు విధిగా పాటించాలి

## అరైవ్ అలైవ్ క్యాపెయిన్-2026లో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..



షామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్..

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం..
- వాహనదారులు లైసెన్సు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి..
- 2025లో దేశవ్యాప్తంగా భారీగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు: ఏసిపి వెల్లడి..
- హెల్మెట్, సీట్‌బెల్ట్, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ అధికారులు హెచ్చరిక..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 16:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పది రోజుల పాటు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్- 2026" కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొని, రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలని సూచించారు.. జిల్లా డిఆర్వో, ఏసిపి, ట్రాఫిక్ ఎస్ఐలతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ, వాహనం కలిగియున్న ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్నెస్ పర్మిట్, పొల్యుషన్ చెక్, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏసిపి వెంకట రెడ్డి మాట్లాడుతూ, పౌరుల పరివర్తన మరియు పౌర సమాజ అవగాహన రోడ్డు భద్రతలో కీలకమని అన్నారు. భారతదేశంలో కేవలం 2025 సంవత్సరానికి గాను ఐదు లక్షల పైన రోడ్డు ప్రమాదాలు జరిగాయని, అందులో 2 లక్షల వరకు మరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను ఉద్యోగులకు నివృత్తి పరిచారు. అలాగే ఉద్యోగులచే "రహదారి భద్రత ప్రతిజ్ఞ" చేయించారు.అనంతరం షామీర్పేట్ సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ, మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాలు, హెల్మెట్ స్ట్రాప్ ఫిక్స్ చేసుకోకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన మన కుటుంబాలకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ లేన్ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే నష్టాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వివరించారు.. ఇదే కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, స్పీడ్ మరియు సేఫ్టీ ప్రమాణాలు అందరూ తెలుసుకొని, మన చుట్టూ ఉన్న అందరికీ తెలియచెప్పడం ప్రభుత్వ ఉద్యోగులుగా మన బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రాఘవరెడ్డి మృతి

## పీఆర్‌టీయూటీఎస్ సంఘానికి తీరని లోటు

**పాలకుర్తి, జనవరి 16 పెన్ పవర్:** నర్సింహులపేటకు చెందిన విశాంత్ర ఉపాధ్యాయుడు, పీఆర్ టీయూ టీఎస్ మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సంకపల్లి రాఘవరెడ్డి మృతి ఆ సంఘానికి తీరని లోటు అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. నర్సింహులపేటలోని ఆయన స్వగృహంలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, పలు సంఘాల నేతలు రాఘవరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియలో పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో పీఆర్ టీయూ టీఎస్ సంఘం బలోపేతానికి రాఘవరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన అసోసియేట్ హోదాలో ఉంటూ రాష్ట్ర అధ్యక్షుడిగా విధులు నిర్వహించడం సంఘ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సంఘానికి నాలుగు దశాబ్దాల కాలం పాటు సేవలందించి, ఎంతో మంది పీఆర్ టీయూ టీఎస్ సంఘ కార్యకర్తలను తీర్చి దిద్దారన్నారు.

## రైలు నుంచి పడి ఆర్మీ సుబేదార్ దుర్మరణం

**జనగామ, జనవరి 16 పెన్ పవర్:** ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తి మృత్యువాత చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం ఆర్యాళ్లూర్ జిల్లా కల్లత్తూర్‌కు చెందిన సంతోష్‌కుమార్ పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం దిల్లీ నుంచి చెన్నైకి అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేస్తుండగా కేసముద్రం, ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 417/21-19 కిలోమీటర్ వద్ద ఎగువ లైన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడ్డాడు. ప్రమాదంలో సంతోష్‌కుమార్ బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

## నార్సింగిలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**నర్సాపూర్, జనవరి 16 పెన్ పవర్:** నార్సింగి మండలం జప్తి శివనూర్ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ బాల్ నర్సింలు, ఉప సర్పంచ్ రాములు, మాజీ ఎంపిటిసి సుజాత-శంకర్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ఈరోజు, రేపు రెండు రోజుల పాటు జరుగుతుంది. ఇందులో మొత్తం 6 టీంలు పాల్గొంటున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీంకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు రాజు, వినోద్, ప్రేమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉండొద్దు:

## కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశం

**మెదక్, జనవరి 16 పెన్ పవర్:** మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మనోహరాబాద్ మండలంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలలో అన్ని రకాల మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యమైన పరీక్షలు, మందులు ఉచితంగా అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మందుల గది, రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి రోగులతో మాట్లాడారు.

## తీగుల్ గ్రామంలో పులి సంచారం:

## అటవీ అధికారుల ఆరా

**సిద్దిపేట, జనవరి 16 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు ప్రజలు గమనించారు. శుక్రవారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా, వారు పులి ఆనవాళ్లను సేకరించారు. ఈ ఆనవాళ్లు నిజమైనవా కావా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వనున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## పేద కుటుంబానికి ప్రజాహిత ఫౌండేషన్ అండ

**గజ్వేల్, జనవరి 16 పెన్ పవర్:** : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన సంగం నవీన్ తల్లి మరణించిన విషయం తెలుసుకున్న ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్ రెడ్డి, వారి కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, నరేష్, నవీన్, ముత్యాలు, కుమార్, స్వామి, నవీన్, మహేష్ రాయుడు, భాను, అజయ్ తదితరులు అందజేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని రాయపోల్ మండలంలో ఈ సంఘటన జరిగింది.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఎన్నికల్లో

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

**దుబ్బాక, జనవరి 16 పెన్ పవర్:** : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని సీనియర్ నాయకులు మంగలి సాయి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీ గణనీయంగా అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్, బీజేపీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో 16వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేస్తానని, అధినాయకత్వం ఆశీర్వాదం, ప్రజల మద్దతు తనకు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి నిరసన సెగ

**వనపర్తి, జనవరి 16 పెన్ పవర్:** : వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి వాకిటి శ్రీహరికి నిరసన సెగ తగిలింది. రెండేళ్లుగా తమ కాలనీ వైపు చూడలేదని, తమ సమస్యల పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కారం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. మంత్రి వారితో మాట్లాడే ప్రయత్నం చేశారు.

## కొయ్యల శ్రీనివాసులు:

## రంగాపూర్ జాతర మత సామరస్యానికి ప్రతీక

**నాగర్‌కర్నూల్, జనవరి 16 పెన్ పవర్:** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన డిసిసి వైస్ ప్రెసిడెంట్ అడ్వకేట్ కొయ్యల శ్రీనివాసులు, ప్రజలందరూ సుఖ, శాంతి, సంపద, ఆరోగ్యంతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అచ్చంపేట సమీపంలోని రంగాపూర్ జాతర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ఐక్యతను పెంపొందించే ప్రత్యేకత ఇక్కడుందని ఆయన అన్నారు. ప్రజల జీవన విధానంలో ఈ ఐక్యత స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం...

## ఒకరు స్పాట్ డెడ్

**కొల్లాపూర్, జనవరి 16 పెన్ పవర్:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దపూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన లారీ ఆర్టీసి బస్సును, బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 600 కుక్కలను చంపేశారు...

**కామారెడ్డి, జనవరి 16, పెన్ పవర్:**
తెలంగాణను దిగ్భ్రాంతికి గురి చేసిన దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లాలోని మచ్చారెడ్డి మండల పరిధిలోని ఫరీద్‌పేట్, భవానిపేట్, వాడి, పలవంచ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా 500 నుంచి 600 వరకు వీధి కుక్కలను విషం ఇచ్చి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సామూహిక హత్యలకు ఆయా గ్రామాలకు ఎన్నికైన సర్పంచ్‌లే కుట్ర పన్నారని ఆరోపణలు ఉన్నాయి. 'గౌతమ్ స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్' ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మచ్చారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల మృతదేహాలు ఒక్కసారిగా కనిపించడంతో కలకలం రేగింది. స్థానికుల కథనం ప్రకారం, ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు ఎన్నికల సమయంలో వీధి కుక్కల సంఖ్య పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో వాటి బెడదను తగ్గించడానికి ఈ "షార్ట్‌కట్"ను ఎంచుకున్నారు. ఆహారంలో విషం కలిపి లేదా విషపూరిత ఇంజెక్షన్ల ద్వారా మూగజీవాలను దారుణంగా చంపారని, అనంతరం ఆధారాలు లేకుండా రహస్యంగా వాటి మృతదేహాలను పూడ్చిపెట్టారని తెలుస్తోంది.వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు ఇటీవల స్పందిస్తూ, కుక్కలను చంపాలని తాము ఆదేశించలేదని, 'పశువుల జనన నియంత్రణ' నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించాలని చెప్పింది. అయితే, పశువుల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 ప్రకారం కుక్కలను ఇలా చంపడం అనైతికం మాత్రమే కాదు, శిక్షార్హమైన నేరం కూడా. కామారెడ్డి పోలీసులు ప్రాథమిక విచారణ ఆధారంగా సంబంధిత సర్పంచ్‌లు, వారి సహచరులపై భారతీయ న్యాయ స్మృతిలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
జంతు ప్రేమికుల సంఘం 'స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్ ఇండియా' ప్రతినిధులకు ఈ విషయం తెలిసింది. వారు ఆ ప్రాంతంలో తిరిగి సమాచారం సేకరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన తర్వాత భయంకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫౌండేషన్ అధికారి గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికైన ప్రతినిధులు చట్టాన్ని ఉల్లంఘించి ఈ నేరం చేశారని ఆయన ఆరోపించారు.తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల దాడులకు సంబంధించిన వార్తలు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, స్టెరిలైజేషన్, టీకాలు వంటి ప్రభుత్వ చర్యలు చేపట్టకుండా సామూహిక హత్యలకు పాల్పడటం అనేది దారుణమని, ఇది అధికార యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.

# సంక్షేమం సరే...ప్రజాసమస్యలు సంగతేంటీ

**హైదరాబాద్, జనవరి 16, పెన్ పవర్:**
తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే అంశం హాట్ టాపిక్ గా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేసింది. 2025-26 బడ్జెట్‌లో ఏకంగా రూ. 56,000 కోట్లను కేవలం ఈ గ్యారెంటీల కోసమే కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అయితే, ప్రజలను నేరుగా ఆకట్టుకునే నగదు బదిలీ, ఉచిత పథకాలపై పెడుతున్న దృష్టి, రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై తగ్గిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక పనులు కూడా నిధుల లేమితో అగిపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతోంది. ముఖ్యంగా గతంలో ఆర్భాటంగా ప్రకటించి శంకుస్థాపనలు చేసిన పలు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉదాహరణకు, వీమీా రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన సుమారు రూ. 381 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. అదేవిధంగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధుల బకాయిలు పెరిగిపోవడం వల్ల పనులు మందగించాయి. కేవలం రైల్వేలే కాకుండా, సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన దేవాదుల వంటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా 2025 నాటికి పూర్తి కావాల్సిన గడువును దాటి 2027కు వాయిదా పడ్డాయి.ప్రభుత్వ వ్యూహం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం , పేదలకు తక్షణ ఊరటనివ్వడం చుట్టూ తిరుగుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి పథకాలు లబ్ధిదారులకు మేలు చేస్తున్నా.. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని సృష్టించే మౌలిక సదుపాయాల కల్పన అటకెక్కడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కొత్త పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయి, ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ , రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూసేకరణ సవాళ్లు , నిధుల సమీకరణ పెద్ద అడ్డంకులుగా మారాయి. ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం వంటి అత్యవసర ప్రాజెక్టుల విషయంలో శంకుస్థాపన చేసినా, అసలు పనులు ప్రారంభం కావడానికి నెలల తరబడి సమయం పడుతోంది. ఆరోగ్య, విద్యా రంగాల్లో మౌలిక వసతుల లేమిపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారెంటీల అమలు కోసం చేస్తున్న అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మరింత కష్టతరం కానుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సంక్షేమ పథకాలతోనే ఓటర్లను మెప్పించవచ్చని భావించడం ప్రభుత్వానికి రాజకీయంగా రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. ఎందుకంటే, ప్రజలు పథకాలతో పాటు మెరుగైన రోడ్లు, సాగునీరు, మౌలిక సదుపాయాలను కూడా కోరుకుంటారు. నిధులన్నీ పథకాలకే మళ్లిస్తూ, కంటికి కనిపించే అభివృద్ధిని విస్మరించడం వల్ల మధ్యతరగతి, పట్టణ ఓటర్లలో వ్యతిరేకత మొదలవుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సరైన సమతుల్యత పాటించకపోతే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# క్రిషాంక్ ఆశలమీద తలసాని నీళ్లు

**హైదరాబాద్, జనవరి 16, పెన్ పవర్:**
భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలపడేసింది. ఇతర పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు.క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు.ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

# సికింద్రాబాద్ కార్పోరేషన్ కోసం ర్యాలీ

# మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్: పెన్ పవర్:** శనివారం ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవం పోరాటం ర్యాలీ జరుగుతుంది. రైల్వే స్టేషన్ నుంచి ఎంజిరోడ్ లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇంటికి ఒకరు చొప్పున సికింద్రాబాద్ నివాసితులు రావాలి. 220 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాంతం సికింద్రాబాద్. అనేక చారిత్రాత్మక ప్రదేశాలు సికింద్రాబాద్ లో ఇమిడి ఉన్నాయి. లష్కర్ బోనాలకు పెద్ద చరిత్ర ఉంది. సికింద్రాబాద్ ను నామరూపాలు లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు.
కమిషనరేట్ లు అక్రమంగా కలిపారు. ఎందుకు కలిపారో చెప్పాలి. రేపు అన్ని రంగాల సంఘాలు పాల్గొనాలి. ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఇదే మంచి సమయం. రేపు కార్యక్రమానికి బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సహా ఎమ్మెల్యేలు కూడా వస్తున్నారు. సికింద్రాబాద్ పేరు మార్చేందుకు కుట్ర జరుగుతుంది. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చారు. ఆ హామీలు అమలు చేయకుండా పేర్లు ఊర్లు మారుస్తూ తుగ్లక్ పాలన చేస్తున్నారు. లష్కర్ సాధన సమితి రెండేళ్లుగా అడుగుతున్నాం. సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం అందరూ కలిసి రావాలని అన్నారు.
అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా ఈ కార్యక్రమం లో పాల్గొనాలి. ఇది శాంతియుత ర్యాలీ. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే కోర్టు నుంచి అనుమతి తీసుకుంటాం. కార్యక్రమం విజయవంతం చేస్తామని అన్నారు.



# రాజన్నను దర్శనం చేసుకున్న మంత్రి సీతక్క



**వేములవాడ: హైదరాబాద్ పెన్ పవర్:** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. "వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని సీతక్క తెలిపారు.

# మున్సిపాలిటీల్లో ఆమెదే హవా...

**హైదరాబాద్, జనవరి 16, పెన్ పవర్:**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఎన్నికల సంఘం దాదాపుగా పూర్తిచేస్తోంది. ఓటర్ల వివరాలను దాదాపుగా ఫైనల్ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 123 మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఈ గణాంకాల ప్రకారం, మొత్తం 2,996 వార్డుల్లో కలిపి 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారు. గతంతో పోలిస్తే పట్టణ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. మున్సిపల్ ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 123 మున్సిపాలిటీలకు గానూ ఏకంగా 113 మున్సిపాలిటీల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఓటర్లలో 51.1 శాతం మంది మహిళలు ఉండగా, వీరి సంఖ్య 26,80,014 గా ఉంది. పురుష ఓటర్లు 25,62,369 (48.9 శాతం) ఉండగా, ఇతరులు 640 మంది ఉన్నారు. పట్టణ ఓటర్ల జాబితాను నిశితంగా గమనిస్తే, పురుషుల కంటే మహిళలు దాదాపు 1.17 లక్షల మంది ఎక్కువగా ఉన్నారు. కేవలం 10 మున్సిపాలిటీల్లో మాత్రమే పురుష ఓటర్లు ఆధిక్యంలో ఉండగా, మిగిలిన చోట్ల మహిళలే నిర్ణాయక శక్తిగా మారనున్నారు. ఈ గణాంకాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల వ్యూహాలను మార్చే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు పట్టణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్ణాయక శక్తిగా ఉన్న మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు మరియు కొన్ని కార్పొరేషన్లకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చి లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన గణన ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే, జనవరి నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి.

ఎత్తులు.. పై ఎత్తులు

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా పురపాలక శాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 మున్సిపాలిటీలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కేటగిరీలకు చైర్‌పర్సన్ స్థానాల సంఖ్యను పురపాలకశాఖ ఖరారు చేసినట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన ఏ ఏ కేటగిరీలకు ఎన్ని స్థానాలు కేటాయించాలనే అంశంపై స్పష్టతనిస్తూ ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. మునిసిపాలిటీ చైర్మన్ల సంఖ్య విభాగాల వారీగా.. జనరల్ 30, జనరల్ మహిళలు 31 స్థానాలు, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19 స్థానాలను కేటాయించాలని పురపాలకశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

**రిజర్వేషన్ల వివరాలు - మొత్తం 121 మున్సిపాలిటీల్లో స్థానాల కేటాయింపు**

జనరల్: 61 స్థానాలు (వీటిలో జనరల్ 30, జనరల్ మహిళ 31)
బీసీ (వెనుకబడిన తరగతులు): 38 స్థానాలు (బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19)
ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు): 17 స్థానాలు (ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8)
ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు): 5 స్థానాలు (ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2)

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం విశేషం.

తుది ప్రకటన ఈ నెల 17న

మునిసిపాలిటీ చైర్మన్ల రిజర్వేషన్ల స్థానాల సంఖ్యను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం, ఏయే మున్సిపాలిటీ ఏ వర్గానికి కేటాయించాలనే (లక్కీ డిప్ లేదా రోస్టర్ విధానం) తుది రిజర్వేషన్లను ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనుంది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. అభ్యర్థులు తమ తమ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.తెలంగాణలో మూడు విడతల్లో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ అంశాలు ఓటర్లపై సానుకూల ప్రభావం చూపినట్లు కనిపిస్తున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులే గెలుస్తారని తెలిసిందే. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని నియోజకవర్గాల్లో, సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెరుగైన ఫలితాలు సాధించారు. బీజేపీ కూడా ఈసారి గ్రామీణ స్థాయిలో తన పట్టును నిరూపించుకుంది, ముఖ్యంగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతుదారులు గణనీయమైన స్థానాల్లో విజయం సాధించారు.

# నల్గొండకు కార్పొరేషన్ హోదా

**నల్గొండ, జనవరి 16, పెన్ పవర్:**
నల్గొండ జిల్లాకు మహర్దశ పట్టనుంది. జిల్లాకు కార్పొరేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కీలక అప్డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తున్న అంశంపై తాజాగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల పాలనపరంగా అధికారాలు పెరిగి, అభివృద్ధికి నిధులు, పథకాలు నేరుగా అందనున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కానుంది.నల్గొండ మున్సిపాలిటీ ఇకపై కార్పొరేషన్‌గా మారనున్న సంగతి తెలిసిందే. జిల్లా కేంద్రానికి కార్పొరేషన్ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నల్గొండను కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా దీనిపై కీలక అప్‌డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కే. శ్రీదేవి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీగా ఉన్న నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల పాలనాపరంగా నల్గొండకు ఎక్కువ అధికారాలు దక్కుతాయి. అలాగే దాని విస్తృతి పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిధులు పెరగనుండటంతో పాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు నేరుగా అందే అవకాశం ఉంది. అలాగే కొత్త డివిజన్లను పునర్వ్యవస్థీకరించనున్నారు.నల్గొండ కార్పొరేషన్‌గా మారడంతో.. ఇకపై ఇక్కడ మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థ అమలులోకి రానుంది. కమిషనర్ స్థాయి అధికారుల వ్యవస్థ అమల్లోకి రావడంతో పాలన మరింత బలోపేతం కానుంది. నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో రహదారులు, మురుగు నీరు, తాగు నీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం అవుతుంది. పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్)లో కార్పొరేషన్ నిబంధనలు అమలు అవుతాయి. ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను విధానాల్లో మార్పులు జరుగుతాయి. త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండ కార్పొరేషన్‌కు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు సంబంధించి రిజర్వేషన్లను ఖరారు చేస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా పాటించాల్సిన మార్గదర్శకాలు, నియమ, నిబంధనలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జనవరి 17న ఏ ఏ స్థానాలను.. ఏ ఏ వర్గాలకు కేటాయిస్తారనే దానిపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది అంటున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండకు కూడా ఎలక్షన్ నిర్వహిస్తారు

# వ్యవసాయ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, జనవరి 16, పెన్ పవర్:**
తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాల విచారణ రెవెన్యూ అధికారులను కలవరపెడుతోంది. 2021-2025 మధ్య కాలంలో జనగామ, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఇప్పుడు ఏసీబీ విచారణకు భయపడుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా.. సంక్రాంతి తర్వాత అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అక్రమాల విచారణ ఇప్పుడు రెవెన్యూ శాఖలో పెను తుపానును సృష్టిస్తోంది. ప్రధానంగా భూముల క్రయవిక్రయాల్లో జరిగిన లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో.. గతంలో కీలక జిల్లాల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు వణికిపోతున్నారు.ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ విచారణ కమిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా సభ్యులుగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో తాము చేసిన భూముల బదిలీలు లేదా రిజిస్ట్రేషన్లలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో సిబ్బంది ఆరా తీస్తున్నారు.ఈ కేసు ఒక ప్రాంతానికో లేదా ఒక అధికారికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేక లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టించడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విచారణలో భాగంగా ఇప్పటికే అనేకమంది భూ యజమానులకు, రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు పంపింది. వారి నుంచి ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరిస్తోంది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా లావాదేవీల్లో తేడాలు వచ్చిన వివరాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు.

ప్రస్తుతానికి ప్రభుత్వం నియమించిన కమిటీ కేవలం ఆధారాల సేకరణలో నిమగ్నమై ఉంది. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత ఈ విచారణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండటంతో.. వారిచ్చే సమాచారం ఆధారంగా రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కేసు తేలే వరకు తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోయింది.

# ఖమ్మం జిల్లాల్లో భారీగా కోడి పందేలు

**ఖమ్మం, జనవరి 16, పెన్ పవర్:**
సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ-ఆంధ్ర సరిహద్దుల్లో కోడి పందాల జోరు శిఖర స్థాయికి చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు సమీపంలోని ఏలూరు జిల్లా గ్రామాల్లో పందెం రాయుళ్లు లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పోలీసుల నిఘా పెరగడంతో, వేలాది మంది జూదరులు కారుల్లో ఆంధ్ర వైపు తరలివెళ్తున్నారు. మామిడి, పామాయిల్ తోటల్లో ఫ్లడ్ లైట్ల మధ్య రాత్రిపూట కూడా పందాలు సాగుతున్నాయి. కోడి కత్తుల పోరుతో పాటు పేకాట, గుండాట వంటి జూదాలు కూడా జోరుగా నడుస్తున్నాయి.సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాల్లో పండుగ సందడి కంటే కోడి పందాల జోరే ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈసారి పందాల వేడి శిఖర స్థాయికి చేరింది. తెలంగాణలో పోలీసులు నిఘా పెంచడంతో.. పందెం రాయుళ్లు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలకు క్యూ కట్టారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలు ఈసారి కోడి పందాలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, చీరవల్లి, శ్రీధర్ వేలేరు, వేలేరుపాడు మండలం మేడేపల్లి వంటి గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచే పందాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులే స్వయంగా ఈ పందాలను ప్రారంభించడం గమనార్హం.మామిడి తోటలు, పామాయిల్ తోటలు పందెం వేదికలుగా మారిపోయాయి. రాత్రి వేళల్లో కూడా పందాలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు, జనరేటర్లు సిద్ధం చేశారు. సంక్రాంతి సమయంలో కోడి పందాలు అనేది కేవలం వినోదం మాత్రమే కాదు.. దీని వెనుక ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ నడుస్తుంది. పందెం కోళ్లను పెంచడం ఒక ప్రత్యేక కళ. వీటికి బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు మాంసాహారాన్ని కూడా ఇస్తుంటారు. ఒక్కో పందెం కోడి ధర వేల నుంచి లక్షల రూపాయల వరకు ఉంటుంది.కోడి కాళ్లకు కట్టే కత్తులను ప్రత్యేకంగా తయారు చేస్తారు. వీటిని 'కోడి కత్తులు' అంటారు. ఈ కత్తులు ఎంత పదునుగా ఉంటాయంటే.. తగిలితే క్షణాల్లో ప్రత్యర్థి కోడి ప్రాణాలు కోల్పోతుంది. పందెం రాయుళ్ల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా విందులు, విలాసాలు ఏర్పాటు చేస్తారు. తెలంగాణలోని భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి వందల సంఖ్యలో కార్లలో ధనవంతులు, వ్యాపారులు ఏపీకి తరలివెళ్లారు. కోడి పందాలు జరిగే చోట కేవలం పందాలే కాకుండా పేకాట, గుండాట వంటి ఇతర జూదాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీని వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో పందెంలో లక్షల రూపాయలు ఓడిపోవడంతో చాలా కుటుంబాలు అప్పుల పాలు అవుతున్నాయి. కొంతమంది

తమ ఆస్తులను, భూములను కూడా అమ్మేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత ఈ జూదానికి బానిస అవుతున్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జూదంలో సంపాదనంతా పోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు రావడం, కుటుంబాలు విచ్ఛిన్నం కావడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. తెలంగాణ వైపు పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపట్టినప్పటికీ.. పందెం రాయుళ్లు దొడ్డిదారిన సరిహద్దులు దాటుతున్నారు.ఏపీ సరిహద్దుల్లో పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు స్వేచ్ఛగా పందాలు నిర్వహిస్తున్నారు. ఇనుప తీగలతో కంచెలు వేసి, కేవలం డబ్బులు కాచే వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తూ రహస్యంగా వ్యవహారాలు నడుపుతున్నారు. ఒక్క రోజులోనే సరిహద్దుల్లో సుమారు రూ. 5 నుంచి 10 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. సంప్రదాయం పేరుతో జరుగుతున్న ఈ జూదం వల్ల అనేక మంది సామాన్యులు వీధిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

## స్నేహితుల అండ: క్లాస్మేట్స్ 25 వేల ఆర్థిక సాయం



**పెద్దపల్లి, జనవరి 16 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దులికట్ట గ్రామానికి చెందిన రేవెల్లి సంపత్, 16 ఏళ్ల క్రితం కూలి పని చేస్తూ ప్రమాదానికి గురై నడుము నుండి కాళ్లు పనిచేయకపోవడంతో వీల్ చైర్‌కు పరిమితమయ్యారు. ఈరోజు, సంపత్ క్లాస్మేట్స్ (2007-08 బ్యాచ్) రూ. 25,000 ఆర్థిక సహాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. భవిష్యత్తులో సంపత్‌కు ఎలాంటి ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని మిత్రులు తెలిపారు.

## సీపీఐ శతవసంతాల జయంతికి కారేపల్లి నుండి భారీగా తరలింపు

**ఖమ్మం, జనవరి 16 పెన్ పవర్:** ఈనెల 18న ఖమ్మం పట్టణంలో జరగనున్న సిపిఐ శతవసంతాల జయంతి సందర్భంగా కారేపల్లి మండల పరిసర ప్రాంతాల నుండి భారీగా కార్యకర్తలను, నాయకులను తరలించేందుకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కారేపల్లి క్రాస్ రోడ్ లోని పుచ్చకాయల శ్రీనివాసరావు నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, వడ్డే వెంకటయ్య, సిపిఎం నాయకులు ఎస్కె సైదులు, బొమ్మల కృష్ణమూర్తి, మేదరమట్ల ప్రేమ్చంద్, పుచ్చకాయల వెంకటకృష్ణ, బొచ్చు లింగయ్య తదితరులు పాల్గొన్నారు. కారేపల్లి మండలం నుండి పలు వాహనాల ద్వారా కార్యకర్తలను తరలిస్తున్నట్లు తెలిపారు.

## సిరిపురం గ్రామంలో భోగి, సంక్రాంతి వేడుకలు ఘనంగా

**మధిర, జనవరి 16 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, వైరాలోని సిరిపురం గ్రామంలో భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని పడమటి ఎస్సీ కాలనీ యూత్, సిరిపురం ప్రోగ్రెసివ్ పీపుల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళల కోసం వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలతో పండుగ వాతావరణాన్ని సందడిగా మార్చారు. ఈ వేడుకలు కాలనీలో ఐక్యతను పెంపొందిస్తూ ఆనందోత్సాహాలతో సాగాయి.

## గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభానికి ముందే ప్రమాదాలు

**వైరా, జనవరి 16 పెన్ పవర్:** అధికారికంగా ప్రారంభం కాకముందే గ్రీన్ ఫీల్డ్ హైవే రక్తసిక్తమవుతోంది. శుక్రవారం తల్లాడ-చెన్నూరు మధ్య రెండు వేర్వేరు ప్రమాదాలు జరిగాయి. ఒకే మార్గంలో వాహనాల రాకపోకలు, అతివేగం కారణంగా ఈ ప్రమాదాలు సంభవించాయి. ఈ ఘటనల్లో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. రహదారి నిబంధనలపై అవగాహన లేకపోవడం, మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణమవుతోందని తెలుస్తోంది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదాల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ వరుస ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

**సత్తుపల్లి, జనవరి 16 పెన్ పవర్:** శుక్రవారం ఉదయం పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఎం బంజర గ్రామానికి చెందిన మార్త నారాయణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గుర్తుతెలియని ట్రాలీ ఢీకొట్టడంతో నారాయణ కుడి కాలు విరిగి రక్తస్రావం అయింది. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో అతడిని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మినీ మేడారం జాతర: ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

**భూపాలపల్లి, జనవరి 16 పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

## కిక్కిరిసిన మేడారం వనదేవతల గద్దెలు

**ములుగు, జనవరి 16 పెన్ పవర్:** ములుగు జిల్లా మేడారంలో వనదేవతల దర్శనానికి శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో గద్దెలు కిక్కిరిసిపోయాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనానికి భక్తులు పోటెత్తారు. నిలువెత్తు బంగారం, గాజులు, పసుపు కుంకుమ, చీరే సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు ప్రైవేటు వాహనాలపై ఆంక్షలు విధించారు.

## మరిపెడలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్

**మహబూబాబాద్, జనవరి 16 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలోని పదవ వార్డులో శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రునాయక్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మరిపెడ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపిన భవన నిర్మాణ కార్మిక సంఘం

**డోర్నకల్, జనవరి 16 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో సంక్రాంతి పండుగ ఉత్సవాలలో భాగంగా మూడో రోజు కనుమ పండుగ సందర్భంగా, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్ కార్మిక, రైతు సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కనుమ పండుగను పశువులను దైవంగా కొలిచే రోజుగా అభివర్ణిస్తూ, పాడి పంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలేశ్వరపు రాజేందర్, కోశాధికారి జేరిపోతుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కోల్‌కతా బ్యాంకు మోసం కేసులో సీబీఐ సోదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతాలోని బ్యాంకు మోసం కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు వివిధ ప్రదేశాలలో గురువారం సోదాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. నగరంలోని న్యూ అలిపోర్ ప్రాంతంలోని ఒక వ్యాపారవేత్త నివాసంలో, నగరానికి సమీపంలోని న్యూ టౌన్‌తో పాటు ఇతర ప్రదేశాలలో సోదాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏజెన్సీకి చెందిన ఐదు బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయని వారు వెల్లడించారు. దర్యాప్తుకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలు, ఇతర వస్తువులను సేకరించడం సమన్వయ ఆపరేషన్ లక్ష్యమని ఒక అధికారి తెలిపారు. ఆర్థిక మోసంలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వాటిని గుర్తించడం ప్రాథమిక లక్ష్యమని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి పెద్ద సంఖ్యలో కేంద్ర దళాల సిబ్బంది సీబీఐ అధికారులతో పాటు ఉన్నారని ఆయన తెలిపారు. కేసుకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం అందిన తర్వాత సోదాలు ప్రారంభించినట్లు అధికారి తెలిపారు.

## మాజీ మంత్రి జోగు రామన్నను పరామర్శించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు అర్ధరాత్రి ముందస్తు హౌస్ అరెస్ట్ చేయడంతో, గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన ఇంటికి చేరుకుని పరామర్శించారు. రైతుల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన జోగు రామన్నను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ అరెస్ట్ జరిగింది.

## ముందస్తు అరెస్టును ఖండించిన బోథ్ ఎమ్మెల్యే

**బోథ్, జనవరి 16 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ పరిణామంపై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టును ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్ ఆదిలాబాద్ పర్యటన: 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

**నిర్మల్, జనవరి 16 పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా, బోరజ్ మండలం చెనాకకోరాట ప్రాజెక్టు పంపు హౌస్ వద్ద ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందితో సమావేశమయ్యారు. కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, పార్కింగ్, హెలిప్యాడ్, కాన్వాయ్, పంప్ హౌస్ చెక్‌పోస్ట్, బాంబు డిస్పోజల్ టీం, ఇన్నర్, ఔటర్ కార్డెన్ వంటి 10 సెక్టార్లుగా విభజించి 500 మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## నిర్మల్ జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు



**ముథోల్, జనవరి 16 పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లా పర్యటన నేపథ్యంలో, ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. భైంసా, ఖానాపూర్ నుంచి సారంగాపూర్ వెళ్లే వాహనాలు తల్వేద మీదుగా, హైదరాబాద్–ఆదిలాబాద్ వాహనాలు ఎన్హెచ్ 44 మీదుగా, ఆదిలాబాద్–భైంసా వాహనాలు కొండాపూర్ బ్రిడ్జి, మంచిర్యాల చౌరస్తా మీదుగా వెళ్లాలని సూచించారు. ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ మార్పులు జనవరి 16, 2026 నుండి అమల్లోకి వస్తాయి.

## ఫ్లూపై అప్రమత్తత: నిపుణుల సూచనలు

**ఖానాపూర్, జనవరి 1 పెన్ పవర్:** యశోద హాస్పిటల్ పాలమనాలజిస్ట్ సాయి రెడ్డి నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ, ఫ్లూ అంటువ్యాధి వైరస్ వల్ల వస్తుందని, దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. శీతాకాలంలో ఇది ఎక్కువగా వస్తుందని, 65 ఏళ్లు పైబడినవారు, 5 ఏళ్ల లోపు పిల్లలు దీని బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందని ఆయన హెచ్చరించారు. నిర్మల్‌లోని దేవేందర్ రెడ్డి హాస్పిటల్‌లో ప్రతి నెలా మొదటి శుక్రవారం అందుబాటులో ఉంటామని, అవసరమైన వారు సంప్రదించవచ్చని ఆయన సూచించారు. యశోద హాస్పిటల్ ముఖ్య కార్యదర్శి శ్రీకాంత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ కరీంనగర్‌లో రాజకీయ వేడి

**కరీంనగర్, జనవరి 16 పెన్ పవర్: :** కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేల పర్యటనలతో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకుల కార్యక్రమాల్లో టికెట్ ఆశించే వారి సంఖ్య పెరిగింది. అధిష్ఠానం దృష్టిని ఆకర్షించేందుకు ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం: మంత్రి

**మానకొండూరు, జనవరి 16 పెన్ పవర్:** తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని శ్రీ గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఎవరికీ ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులున్నా, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు, రుణాలు, ఇందిరమ్మ క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహిళా అధికారులను కించపరిచిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

## వేములవాడలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి సీతక్క

**వేములవాడ, జనవరి 16 పెన్ పవర్:** వేములవాడ రాజన్నను మంత్రి సీతక్క తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కోడెను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనవరి 19న మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న సమ్మక్క–సారలమ్మ గద్దెల పునః ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు.

# జీహెచ్‌ఎంసీ పునర్విభజన: భిన్నవాదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరం భారతదేశ పట్టణ వికాస చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రాజ్యాంగానంతర కాలంలో ఒక ప్రాంతీయ రాజధానిగా ప్రారంభమైన ఈ నగరం, కాలక్రమేణా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మెట్రోపాలిటన్ నగరంగా రూపాంతరం చెందింది. జనాభా విస్తరణ, వలసల పెరుగుదల, సమాచార సాంకేతిక రంగ విప్లవం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి వంటి అంశాలు హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చేశాయి. ఈ విస్తరణతో పాటు నగర పాలన ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంశం కేవలం పరిపాలనా చర్యగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను నిర్ణయించే కీలక అంశంగా మారింది. హైదరాబాద్ మున్సిపల్ పాలన చరిత్రను పరిశీలిస్తే, 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ఏర్పడినప్పటి నుంచి నగరం అనేక దశల్లో విస్తరించింది. అప్పట్లో నగర విస్తీర్ణం సుమారు 175 చదరపు కిలోమీటర్లు కాగా, జనాభా 12 నుంచి 15 లక్షల మధ్యే ఉండేది. పరిమిత పరిధిలో పరిపాలన సాగిన ఆ దశలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నగర సమస్యలపై పట్టు ఉండేది. కానీ 1990ల తరువాత హైదరాబాద్ ఐటీ హబ్‌గా ఎదగడం ప్రారంభమైనప్పటి నుంచి నగర ముఖచిత్రం వేగంగా మారింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి ప్రాంతాలు ప్రపంచ స్థాయి కార్పొరేట్ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. ఈ వేగవంతమైన విస్తరణకు పరిపాలనా రూపం కల్పించాల్సిన అవసరంతో 2007లో అప్పటి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చుట్టుపక్కల ఉన్న 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయతీలతో విలీనం చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఈ విలీనంతో నగర విస్తీర్ణం సుమారు 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అప్పటి అంచనాల ప్రకారం జనాభా 75 లక్షలకు పైగా చేరింది. పట్టణ ప్రణాళికను సమగ్రంగా అమలు చేయడం, మౌలిక వసతుల అభివృద్ధిని ఒకే పాలనా పరిధిలో సమన్వయం చేయడం ఈ విలీనానికి ప్రధాన ఉద్దేశంగా ప్రకటించారు.

అయితే, విస్తీర్ణం పెరిగిన కొద్దీ పరిపాలనా అసమానతలు కూడా స్పష్టమయ్యాయి. కొన్ని ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని ప్రాంతాలు మౌలిక వసతుల కొరతతోనే కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2016లో జీహెచ్‌ఎంసీలో మరోసారి డీలిమిటేషన్ చేపట్టి, అప్పటివరకు ఉన్న 72 డివిజన్లను 150 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డుకు సగటున 40 నుంచి 50 వేల జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఆ సమయంలో ఈ నిర్ణయం పరిపాలనా సమర్థతకు దోహదపడుతుందని భావించారు. కానీ గణాంకాలు చెబుతున్న వాస్తవం మరోలా ఉంది. 2011 జనగణన ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ జనాభా సుమారు 77 లక్షలు. అయితే పట్టణాభివృద్ధి శాఖ, నగర ప్రణాళిక సంస్థల తాజా అంచనాల ప్రకారం 2024?25 నాటికి ఈ సంఖ్య కోటిన్నరకు చేరింది. కొన్ని అంచనాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 800 నుంచి 1000 మంది వలస దారులు స్థిరపడు తున్నారు. ఐటీ, నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ వలసల ప్రభావంతో కొన్ని వార్డుల్లో జనాభా లక్ష నుంచి లక్షన్నర దాటింది. జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 30 వేల నుంచి 35 వేల వరకు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 2016 డీలిమిటేషన్ లక్ష్యాలు చాలావరకు నిర్వీర్య మయ్యాయి. ఒక్కో కార్పొరేటర్ పరిధిలో జనాభా విపరీతంగా పెరగడంతో ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పర్యవేక్షణ కష్టమైంది. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక అంశాలపై ఫిర్యాదులు పెరిగినా, వాటిని సమయానికి పరిష్కరించే సామర్థ్యం పరిమితమైంది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మౌలిక సూత్రమే ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ పునర్విభజన లేదా తాజా డీలిమిటేషన్ అవసరం తెరపైకి వచ్చింది. డీలిమిటేషన్ అంటే కేవలం వార్డుల సంఖ్య పెంచడం కాదు. జనాభా సమతుల్యత, భౌగోళిక సౌలభ్యం, సామాజిక అనుసంధానం, రహదారి నెట్‌వర్క్, సహజ హద్దులు వంటి అంశాల ఆధారంగా పరిపాలనా సరిహద్దులను పునః రూపకల్పన చేయడం. దీని ప్రధాన ఉద్దేశం ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం. డీలిమిటేషన్ ప్రయోజనాలు అనేకం. చిన్న వార్డులు ఏర్పడితే ప్రజా ప్రతినిధికి తన పరిధిలోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పగలుగుతారు. అధికార యంత్రాంగానికి కూడా పనిభారం సమంగా పంచ బడుతుంది. వార్డు స్థాయి కమిటీలు సమర్థంగా పనిచేసే అవకాశం ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరాల ఆధారంగా సముచితంగా జరిగే వీలుంటుంది. ముఖ్యంగా పట్టణ పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం పెరుగుతుంది. అయితే డీలిమిటేషన్‌కు లోపాలు కూడా ఉన్నాయి. హద్దుల పునర్విభజన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగితే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. కొన్ని కాలనీలు సామాజికంగా ఒకటిగా ఉన్నప్పటికీ వేర్వేరు వార్డుల్లోకి చీలిపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. ప్రజలకు తమ కార్పొరేటర్ ఎవరో తెలియని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అదనంగా, కొత్త వార్డుల ఏర్పాటుతో పరిపాలనా వ్యయాలు పెరుగుతాయి. సిబ్బంది నియామకాలు, కార్యాలయాలు, మౌలిక వసతుల ఏర్పాటు కోసం అదనపు ఖర్చు అవసరం అవుతుంది. ఈ అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అధికార పార్టీల నేతలు డీలిమిటేషన్‌ను పరిపాలనా అవసరంగా చిత్రీకరిస్తూ, నగర అభివృద్ధికి ఇది తప్పనిసరి అంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పరిపాలనా యూనిట్లు మారాల్సిందేనని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు డీలిమిటేషన్ వెనుక రాజకీయ లెక్కలున్నాయంటూ ఆరోపిస్తున్నాయి. వార్డుల హద్దుల మార్పుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమే దీనికి కారణమని వారు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తమ బలాన్ని తగ్గించేలా హద్దులు మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. నగరానికి చెందిన కొంతమంది సీనియర్ రాజకీయ నేతలు మాత్రం డీలిమిటేషన్ అవసరమేనని అంగీకరిస్తూనే, దాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. జనాభా గణాంకాలు, భౌగోళిక అంశాలు, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జరిగే పునర్విభజన నగర పాలనను మరింత గందరగోళానికి గురి చేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజలతో సంప్రదింపులు, అభ్యంతరాల స్వీకరణ, నిపుణుల సూచనలు వంటి ప్రక్రియలు లేకుండా డీలిమిటేషన్ చేస్తే న్యాయపరమైన వివాదాలు తప్పవని అభిప్రాయ పడుతున్నారు.

జీహెచ్‌ఎంసీ పునర్విభజన అంశాన్ని విస్తృతంగా పరిశీలిస్తే, ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల వరకే పరిమితం కాదని స్పష్టమవుతుంది. నగర ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య బలోపేతం వంటి అంశాలతో ఇది ముడిపడి ఉంది. ప్రపంచంలోని ఇతర మెట్రో నగరాల అనుభవాలు చూస్తే, పరిపాలనా యూనిట్లను కాలానుగుణంగా సవరించుకుంటూ వెళ్లిన నగరాలే స్థిరమైన అభివృద్ధిని సాధించాయి. హైదరాబాద్ లాంటి వేగంగా విస్తరిస్తున్న నగరానికి డీలిమిటేషన్ ఒక అవసరం. కానీ అది ప్రజా హితం కేంద్రంగా, పారదర్శకంగా, శాస్త్రీయంగా జరగాలి. కేవలం సంఖ్యల మార్పుతో కాకుండా, డిజిటల్ గవర్నెన్స్, జియో–మ్యాపింగ్ ఆధారిత సేవలు, ప్రజల భాగస్వామ్యం వంటి సంస్కరణలతో అనుసంధానించి నప్పుడే పునర్విభజనకు అర్థం ఉంటుంది. లేకపోతే, హద్దులు మారినా సమస్యలు అదే స్థాయిలో కొనసాగుతాయి. మొత్తంగా చెప్పాలంటే, జీహెచ్‌ఎంసీ పునర్విభజన హైదరాబాద్ నగర భవిష్యత్తును నిర్దేశించే కీలక మలుపు. ఇది పరిపాలనా సమర్థతకు దోహద పడాలంటే రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా అమలు కావాలి. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి తగిన పరిపాలనా రూపాన్ని ఇవ్వడమే ఈ ప్రక్రియ యొక్క నిజమైన లక్ష్యంగా ఉండాలి. అప్పుడు మాత్రమే జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్ నగరాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది.

# ఏపీలో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు

**కడప, జనవరి 17, పెన్ పవర్:** రాయలసీమను రతనాలసీమ గా పేర్కొంటారు. ఖనిజ సంపదకు పెట్టింది పేరు కూడా. అందుకే ఖనిజాల కాణాచి అంటారు. చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో ఖనిజ నిక్షేపాలు అధికం. రాయలసీమలో దొరికే ఖనిజ నిక్షేపాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని.. ఇది అత్యంత విలువ చేసే గని అని అమెరికా పరిశోధనల్లో తేలినట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా తిరుపతి జిల్లాలోని మంగంపేట బైరైటీస్ గనుల్లో అరుదైన పుల్లరిన్ ఖనిజా నిక్షేపాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు సమాచారం. నానో టెక్నాలజీకి కీలకమైన పుల్లరిన్ వెలికి తీస్తే దేశ భవిష్యత్తే మారిపోతుంది. ప్రస్తుతం దీనిపైనే పెద్ద చర్చ నడుస్తోంది. సుమారు 18 సంవత్సరాల కిందట మంగంపేటగనుల్లో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటినుంచి లోతైన అధ్యయనం కొనసాగుతోంది. పుల్లరిన్ అనేది కార్బన్ మిళితమైన ఓ పదార్థం. గోళ, స్థూపాకార ఆకృతుల్లో ఉండే ఖనిజం. అయితే ఇది ఉక్కు కంటే దృఢత్వంలో 2005 రెట్లు ఎక్కువ. పది రెట్లు తేలికైంది కూడా. అందుకే అమెరికా లోతైన పరిశోధనలు చేపట్టింది. మిగతా దేశాలు సైతం ఇప్పుడు అదే పనిలో ఉన్నాయి. మంగంపేట బైరైటీస్ గని పరిసరాల్లో మొత్తం 156 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నమూనాలు సేకరించి పరీక్షించారు. భువనేశ్వర్ లోని ఐఎంఎంటీ బృందం సైతం ఇక్కడ నమూనాలను సేకరించింది. కానీ తరువాత ఎందుకో సైలెంట్ అయింది. పుల్లరిన్ అనేది ప్రత్యేక ఖనిజం. ఎన్నో రకాల ప్రయోజనాలు దీని సొంతం. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, పిడుగుపాటు నుంచి రక్షణకు విమానాలకు పైపూతగా దీనిని వాడుతారు. క్షిపణులకు ఈ పూత రాస్తే రాడార్లు కూడా పసిగట్టలేవు. ప్రధానంగా ఇంధన వాహకాల తయారీలో ఈ ఖనిజాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్, సోలార్ ఎనర్జీ టెక్నాలజీ పరంగాను దీనిని వాడుతారు. ఇంతటి ఈ ఖనిజంపై అమెరికా సీరియస్ గా పరిశోధనలు చేస్తోంది. సక్సెస్ అయితే ఈ ఖనిజం నిజంగా బంగారమే. ఈ దేశ తలరాతనే మార్చేస్తుంది.

# కోట్ల రూపాయిల్లో పందేలు...

**ఏలూరు, జనవరి 17, పెన్ పవర్:** సంక్రాంతి పండగ రెండు రోజుల్లోనే బరుల్లో కోడి పందేలు జోరుగా జరిగాయి. కోడిపందేల్లో వందల కోట్లు చేతులు మారినట్లు సమాచారం. పెద్దయెత్తున భారీగా పందేలు కాయడంతో రెండు రోజుల్లోనూ వంద కోట్ల మేర బెట్టింగ్ లు జరిగాయని సమాచారం. రేపు కనుమ కావడంతో మరింతగా పందెంరాయుళ్లు రెచ్చిపోతారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. క్రికెట్ గ్రౌండ్స్ ను మరిపించేలా కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కోడి పందేలను వీక్షించేందుకు పెద్దయెత్తున జనం తరలి వచ్చారు. పోలీసుల ఆంక్షలు ఏమాత్రం పనిచేయలేదు. యధేచ్ఛగా పందేలు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఒక్క ఉభయ గోదావరి జిల్లాల్లోనే రెండు వందలకు పైగానే బరులున్నాయి. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బరులు ఎక్కువగా ఈ ఏడాది ఏర్పాటు చేశారు. అయితే ఈసారి వరసగా నాలుగుసార్లు కోడిపందేల్లో నెగ్గిన కోడి యజమానికి బుల్లెట్ బండి బహుమతిగా ఇస్తున్నారు. ఫైనల్ విజేతకు ఇన్నోవా కారును బహుమతిగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. బరుల వద్దనే ఇన్నోవా కారును కూడా ఉంచి మొదటి బహుమతి గెలిచిన కోడి యజమానికి అందచేస్తామని ప్రకటించారు. చాలా బరుల్లో పాస్ లు ఉన్న వారికి మాత్రమే గ్యాలరీలోకి అనుమతి ఇస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయని చెబుతున్నార. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇక్కడకు క్యూకట్టారు. ఇతర జిల్లాలకుచెందిన వారు కూడా ఇక్కడకు తరలి వచ్చారు. బరులవద్దనే మంచి భోజనాన్నిఅందిస్తున్నారు. కోడికూర, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, చేపల పులుసు తో పాటు గోదావరి జిల్లాలకు చెందిన రుచులన్నీఅక్కడకు వచ్చిన వారికి అందిస్తున్నారు. ఇక మద్యం కూడా అక్కడే అందుబాటులో ఉంది. కాస్ట్ లీ మద్యం నుంచి నాసిరకం సరుకు వరకూ లభ్యమవుతుంది. ఖరీదైన కార్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ అత్యంత ఖరీదైన కార్లు కూడా బరుల వద్ద కనిపిస్తున్నాయి. అంతా క్యాష్ తోనే పందేలు కాస్తున్నారు. కొన్ని చోట్ల గూగుల్, పేటీఎం ద్వారా పే చేసే సౌకర్యం కల్పించినా ఎక్కువ మంది కరెన్సీ కట్టలనే తీసుకు వచ్చి పందేలు కాస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో జరిగిన ఒక బరిలో ఒక్క పందెంలో దాదాపు కోట్ల రూపాయలుచేతులు మారినట్లు తెలిసింది. కరెన్సీని లెక్కపెట్టేందుకు అక్కడకు మనీ కౌంటింగ్ మిషన్లు కూడా తెచ్చారు.

### యుద్ధానికి ఆజ్యంపోసిన కోడి పందేలు

కేవలం గెలుపోటములే కాకుండా, పందెంలో గెలిచిన వారికి ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ప్రకటించారు. దాంతో ఈ పోటీపై రాష్ట్రంలో అందరి దృష్టి నెలకొంది. రావులపాలెంలో ఏర్పాటు చేసిన ఈ బరిలో పోరు సాగింది. నిర్వాహకులు మొత్తం ఏడు పందేలను నిర్వహించగా, అందులో 5 పందేలు ఎవరు గెలిస్తే వారికి బుల్లెట్ బైక్ ఇస్తామని ప్రకటించారు. ఒక వర్గం అసాధారణ ప్రతిభను కనబరిచి 7 పోటీలకు గాను 6 పందేలలో విజయం సాధించి ఖరీదైన బుల్లెట్ బైక్‌ను సొంతం చేసుకుంది. విజేతగా నిలిచిన గ్రూప్ వారికి డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుకూరి సతీష్ చేతుల మీదుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్ అందజేశారు. పందెం కోళ్ల పోరాటం చూసి, ఈవెంట్ హాజరైన వారు ఆశ్చర్యపోయారు. కోడి పందేలలో భూములు, ఏళ్ల తరబడిగా సంపాదించిన ఆస్తులు కోల్పోయిన వాళ్లు సైతం ఉంటారు. సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల జోరు కనిపిస్తుంటుంది. అయితే, చరిత్రను గమనిస్తే వీటి కారణంగా యుద్ధాలు సైతం జరిగాయని తెలుస్తోంది. అందుకు ఉదహరణే మాచర్ల, గురజాల మధ్య జరిగిన పోరు. ఏపీలో ఎంతో ముఖ్యమైన పల్నాటి యుద్ధం ప్రారంభం కావడానికి కోడిపందెమే ప్రధాన కారణం అని తెలిసిన వారు ఆశ్చర్యపోతున్నారు. పల్నాటి చరిత్రలో మాచర్ల పాలకులకు బ్రహ్మనాయుడు, గురజాల పాలకులకు నాగమ్మ మంత్రులుగా ఉండేవారు. అయితే ఓ సందర్భంలో వీరు సరదాగా కోడి పందేలు వేసుకున్నారు. కొన్ని విభేదాలను పరిష్కరించేందుకు కోడి పందేలు నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఓడినవారు వనవాసం చేయాలని కండీషన్ పెట్టడంతో కోడి పందేల పోరు మరింతఉత్కంఠ రేపింది. మాచర్ల బ్రహ్మనాయుడుకు చెందిన కోడిపుంజు చిట్టిమల్లుడు, గురజాల నాగమ్మకు చెందిన కోడిపుంజు సివంగిడేగ బరిలో నిలిచాయి. హోరాహోరాగా జరిగిన కోడి పందెంలో సివంగిడేగ విజయం సాధించగా షరతు ప్రకారం ఓడిన బ్రహ్మనాయుడు వర్గం కొన్నేళ్లపాటు వనవాసానికి వెళు_ంది. తిరిగివచ్చిన తరువాత షరతు ప్రకారం రాజ్యం తిరిగివ్వాలని కోరగా గురజాల నాగమ్మ వర్గం తరస్కరించడంతో పల్నాడులో యుద్ధం జరిగందని చరిత్రకారులు పేర్కొన్నారు

# అన్ని ఎన్నికలలోనూ ఒంటరిగా పోటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో: వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎన్నికలలో బహుజన్ సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి అన్నారు. గురువారం ఆమె 70వ పుట్టినరోజు సందర్భంగా లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. చిన్నా పెద్దా అన్ని ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేయడం మరింత సముచితమని, ప్రస్తుత పరిస్థితిలో ఏ పార్టీతోనూ ఎలాంటి పొత్తు పెట్టుకోకూడదని నిర్ణయించుకుందని కూడా ఆమె వెల్లడించారు. ఏ ఇతర పార్టీ కూడా బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేయకపోవడమే

ఈ నిర్ణయానికి కారణమని వివరించారు. భవిష్యత్తులో బీఎస్పీ అటువంటి ఓట్లను సమర్థవంతంగా బదిలీ చేయగలదని తాము పూర్తిగా నమ్మితే, కూటమి పార్టీలతో పోటీ చేయడం గురించి సానుకూల నిర్ణయం తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అయితే, దేశంలో అలాంటి పరిస్థితి ఏర్పడటానికి సంవత్సరాలు పడుతుందని మాయావతి అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు 2027లో బీఎస్పీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారని కూడా ఆమె పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆమె అన్నారు.

# కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సును ప్రారంభించిన ప్రధాని మోడీ

**హైదరాబాద్ పెన్ పవర్:** పార్లమెంట్ సంవిధాన్ సదన్‌లో కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ప్రారంభించారు. గ్లోబల్ పార్లమెంటరీ లీడర్స్ 28 వ సదస్సుకు భారత్ నేతృత్వం వహిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలోపేతం అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ప్రధాని ప్రసంగిస్తూ ? ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి లాంటిదని.. భారత్ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేసిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో పార్లమెంటరీ వ్యవస్థ మరింత పారదర్శకంగా తయారవుతుందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి గ్లోబల్ సౌత్, కామన్ వెల్త్ దేశాలకు ఉపయోగపడుతుందన్న మోడీ.. కరోనా సంక్షోభ సమయంలో భారత్ ప్రపంచానికి మందులు, వ్యాక్సిన్లు సరఫరా చేసిందన్నారు. ప్రజాస్వామ్య సంస్థల బలోపేతానికి భారత్ కట్టుబడి ఉందని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కామన్వెల్త్ దేశాల స్పీకరులతో బిర్లా ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. కామన్వెల్త్ దేశాల సమాఖ్యలోని 42 దేశాల నుంచి దాదాపు 61 మంది స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. వీరితో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 4 పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగిన పార్లమెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



"ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, బలోపేతంలో స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల బాధ్యత ఎంత ?. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్లమెంటరీ వ్యవహారాల్లో కృత్రిమ మేధను ఎలా వాడుకోవాలి ?. పార్లమెంట్ సభ్యులపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఎలా ఉంది ?. చట్టసభల పనితీరుపై సామాన్యుల్లో అవగాహన పెంచడం ఎలా ?" అంశాలపై సదస్సులో ప్రధానంగా చర్చించనున్నారు.

# ఇకనైనా బిసిల ప్రాతినిధ్యం పెరిగేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మరో నిర్ణాయక దశను దాటింది. ఓటరు జాబితా తుదిరూపు దాల్చిన తర్వాత తాజాగా మున్సిపల్ శాఖ రిజర్వేషన్లను పూర్తిగా ఖరారు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికల వాతావరణంలోకి ప్రవేశించాయి. రాష్ట్రంలో ఉన్న 131 పట్టణ స్థానిక సంస్థలు? 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు?అన్నింటికీ మేయర్, చైర్పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిల్లో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నిర్ణయాలు కేవలం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియగానే కాకుండా, రాబోయే రాజకీయ సమీకరణలకు దిశానిర్దేశం చేసే అంశంగా మారాయి. ముఖ్యంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలు, మహిళలకు పెద్ద ఎత్తున చైర్పర్సన్, మేయర్ స్థానాల కేటాయింపు, 'డెడికేటెడ్ కమిషన్' నివేదిక ఆధారంగా సంఖ్యల నిర్ణయం?ఈ మూడు అంశాలు ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా మార్చాయి. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో గత అనుభవాలను పరిశీలిస్తే, రిజర్వేషన్ల అంశమే అత్యంత వివాదాస్పదంగా మారిన సందర్భాలు అనేకం. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై న్యాయస్థానాల జోక్యం కారణంగా గతంలో ఎన్నికలు వాయిదా పడిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ప్రత్యేకంగా 'డెడికేటెడ్ కమిషన్'ను ఏర్పాటు చేసి, జనాభా గణాంకాలు, సామాజిక?ఆర్థిక పరిస్థితులు, పట్టణ ప్రాంతాల్లో వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయించింది. ఆ నివేదిక ఆధారంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ ఖరారు చేయడం ద్వారా ప్రభుత్వం ఒకవైపు సామాజిక న్యాయాన్ని ప్రతిపాదిస్తూనే, మరోవైపు న్యాయపరమైన అడ్డంకులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ నిర్ణయం ఆ అసమతుల్యతను సరిచేసే దిశగా కీలక అడుగుగా భావించబడుతోంది. మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలుస్తోంది. మొత్తం మున్సిపాలిటీల్లో 60 చైర్పర్సన్ స్థానాలు, కార్పొరేషన్లలో 5 మేయర్ స్థానాలు మహిళలకు కేటాయించ బడటం పట్టణ పాలనలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడాలి. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళా రిజర్వేషన్లు విస్తృత ప్రభావం చూపిన నేపథ్యం ఉంది. అదే తరహాలో పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెరగడం వల్ల పాలనలో కొత్త దృక్పథం, ప్రజా సంబంధాలపై ఎక్కువ శ్రద్ధ, సామాజిక సమస్యల పట్ల సున్నితత్వం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే, మరోవైపు కుటుంబ రాజకీయాలు, ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా అధికారాన్ని వినియోగించే పరిస్థితులు కొనసాగు తాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందన్న వాదనకు ఈ నిర్ణయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జీహెచ్ఎంసీ సహా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్ కావడం వల్ల ఇప్పుడు రాజకీయ దృష్టి పూర్తిగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపైకి మళ్లింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా భావించ బడతాయి. హైదరాబాద్ నగరం రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక కేంద్రంగా ఉండటం వల్ల ఇక్కడి ఫలితాలు మిగతా ప్రాంతాలపై ప్రభావం చూపుతాయి. గత ఎన్నికల్లో జీహెచ్ఎంసీ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఈసారి కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట వంటి కార్పొరేషన్లలోనూ పట్టణ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, యువత ఓటింగ్ తీరు కీలకంగా మారనుంది. ప్రభుత్వం ఆరు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ఎన్నికల నిర్వహణపై తన సంకల్పాన్ని స్పష్టంగా చాటింది. వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు కలెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు పంపించడంతో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు వేగవంత మయ్యాయి. కేబినెట్ భేటీ అనంతరం ఎవరికీ ఏ స్థానం అన్న స్పష్టత రావడంతో ఆశావహుల్లో కదలిక మొదలైంది. ఒకే పార్టీ టికెట్ కోసం పలువురు పోటీ పడుతున్న పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ, మహిళా రిజర్వేషన్ వచ్చిన స్థానాల్లో పోటీ తీవ్రంగా మారే సూచనలు ఉన్నాయి. ఇది పార్టీలకు అంతర్గత అసంతృప్తులను ఎదుర్కొనే పరిస్థితిని కూడా తెచ్చిపెట్టవచ్చు.

ప్రభుత్వ వ్యూహాన్ని గమనిస్తే, ఈ ఎన్నికలను ఒక రకంగా ప్రజాభిప్రాయ సేకరణగా మలచు కోవాలన్న ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయాన్ని, మహిళా రిజర్వేషన్ల ద్వారా ప్రగతిశీల పాలనను ప్రతిబింబించేలా ప్రభుత్వం తన వాదనను నిర్మిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అమలు చేసిన అభివృద్ధి పనులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలు ఓటర్లను ఎంతవరకు ఆకర్షిస్తాయన్నది ఫలితాల్లో తేలనుంది. మరోవైపు ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా చూస్తున్నాయి. పట్టణాల్లో పెరిగిన జీవన వ్యయం, ఇంధన ధరలు, ఆస్తి పన్నులు, ట్రాఫిక్ సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రాలుగా చేసుకోవాలని భావిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియలో కొన్ని చోట్ల అసమతుల్యత ఉందన్న ఆరోపణలు, వార్డు పునర్విభజనలో రాజకీయ లాభనష్టాల కోణం ఉందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, స్థానిక సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యంగా చూస్తారని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. గణాంకాల పరంగా చూస్తే, 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలవడం వల్ల వేలాది మంది కొత్త నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేసే అవకాశం ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లతో కలిపి మొత్తం పట్టణ స్థానిక సంస్థల పాలనలో విస్తృత సామాజిక ప్రాతినిధ్యం కనిపించనుంది. ఇది స్థానిక సమస్యల పరిష్కారంలో విభిన్న వర్గాల స్వరాలు వినిపించే అవకాశాన్ని పెంచుతుంది. అయితే, అదే సమయంలో అనుభవం లేని నాయకత్వం వల్ల పరిపాలనా సామర్థ్యం తగ్గుతుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. దీనికి సమాధానం ఎన్నికల అనంతరం పాలనలోనే తేలనుంది. వచ్చే నెల రెండో వారంలోపే ఎన్నికలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రచారం మరింత ఉధృతం కానుంది. తక్కువ సమయంలో ఓటర్లను చేరుకోవడానికి పార్టీలన్నీ సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం, వార్డు స్థాయి సమావేశాలపై ఎక్కువగా ఆధారపడ నున్నాయి. యువత ఓటింగ్ శాతం పెరిగే అవకాశముండటంతో వారి సమస్యలు, ఆశలు కూడా ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారతాయి. పట్టణ ఓటర్లు కేవలం పార్టీ అనుబంధంతో కాకుండా, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే పరిస్థితి పెరుగుతోంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఇది సామాజిక న్యాయం, మహిళా సాధికారత, పట్టణ పాలనలో సమగ్రత అనే మూడు మూల స్తంభాలపై ఆధారపడి ముందుకు సాగుతున్న ప్రక్రియగా చూడాలి. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలనకే పరిమితం కాకుండా, రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే సూచనలు ఉన్నాయి. పట్టణ ఓటర్లు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయ దిశను ఎంతవరకు మార్చగలదన్నది త్వరలో తేలనుంది. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలే పునాది అన్న భావనను మరోసారి గుర్తుచేస్తూ, ఈ మున్సిపల్ ఎన్నికలు ఒక కీలక అధ్యాయంగా చరిత్రలో నమోదు కానున్నాయి.

## ఆ అబద్ధాలు ఆపితేనే పాక్‌కు మంచిది

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాది దేశానికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. ఐరాస సమావేశంలో పాకిస్థాన్ శాశ్వత రాయబారి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. అతడి ఆరోపణలను భారత శాశ్వత మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ ఖండించారు. తన అసత్య వాదనలు, విభజన అజెండాతో పాక్ అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారని తెలిపారు. జమ్మూకశ్మీర్ విషయంలో అనవసరమైన సూచనలు చేయాల్సిన అవసరం పాకిస్థాన్‌కు లేదన్నారు. ఈ విషయంలో పాక్ నిరాధారమైన ఆరోపణలు, అబద్ధాలను ప్రచారం చేయకుండా వాస్తవాలను గ్రహిస్తే మంచిదని హితవు పలికారు.

## ఐప్యాక్ ఆఫీసులో సోదాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐప్యాక్ ఆఫీసులో సోదాలపై సుప్రీంకోర్టులో ఈడీ అధికారులకు ఊరట లభించింది. కొద్దిరోజుల క్రితం ఐప్యాక్ ఆఫీసులో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించగా.. ఆ సోదాలను వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు. ఈడీ అధికారులు.. తమ నుంచి కీలక ఫైల్స్ ను తీసుకెళ్లినట్లుగా ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో బెంగాల్ సీఎం మమత, పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈడీ విధుల్లో జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై రెండువారాల్లో సమాధానమివ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. అలాగే ఐప్యాక్ ఆఫీసులో సీసీపుటేజీని భద్రపరచాలని ఆదేశించింది. దాడుల సమయంలో తీసిన వీడియోలు ఉన్న సీసీటీవీ ఫుటేజ్ తో పాటు ఇతర స్టోరేజ్ పరికరాలను భద్రపరచాలని ప్రతివాదులను కోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వీ, దర్యాప్తు బలవంతపు చర్యలు లేకుండా కొనసాగించాలని కోర్టును కోరారు. అలాగే స్టే కొనసాగితే.. అవసరమైతే మరిన్ని దరఖాస్తులు దాఖలు చేసేందుకు అదనపు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈడీ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్ పై రెండు వారాల వరకూ స్టే విధించింది. బెంగాల్ డీజీపీని సస్పెండ్ చేయాలన్న ఈడీ పిటిషన్ పై విచారణ చేసిన సుప్రీంకోర్టు.. కేంద్ర హోంశాఖకు నోటీసులు పంపింది.

## ఏ భారతీయ కంపెనీకీ సాధ్యం కాదు: అమెరికా సుంకాలపై థరూర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో వ్యాపారం చేసే అన్ని దేశాల పైనా 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. అమెరికా విధిస్తోన్న సుంకాల వల్ల మన ప్రాంతీయ పోటీదారులతో పోలిస్తే భారత్ ఇప్పటికే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనివల్ల ఏ భారతీయ కంపెనీ కూడా అమెరికాకు 75 శాతం సుంకాలు చెల్లించి ఎగుమతి చేయడం సాధ్యం కాదన్నారు. భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందాలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు యూఎస్ రాయబారి సెర్గియో గోర్ సహకరిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. అమెరికా విధిస్తోన్న ఈ సుంకాలు ఆందోళనకరంగా ఉన్నాయని థరూర్ పేర్కొన్నారు. ఎందుకంటే ఇప్పటికే రష్యాతో వాణిజ్యం చేస్తున్నందుకు భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారని.. మళ్లీ ఇరాన్‌తో వ్యాపారం విషయంలో 25 శాతం సుంకాలు విధిస్తున్నారన్నారు. ఇన్ని టారిఫ్‌లను తట్టుకొని 75 శాతం సుంకాలతో అమెరికాకు మన ఉత్పత్తులను ఎగుమతి చేయడం ఆచరణీయం కాదన్నారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం విషయంలో ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

## 52 మంది మావోయిస్టులు లొంగుబాటు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన 21 మంది మహిళలు సహా లొంగిపోయిన కార్యకర్తలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్ర-ఒడిశా బోర్డర్ డివిజన్, భమ్రాఘర్ ఏరియా కమిటీ (మహారాష్ట్ర) మావోయిస్టులలో చురుకుగా ఉన్నారని వారు తెలిపారు. "పూనా" మార్గెమ్ చొరవ కింద వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పీఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం (జనవరి 14, 2026) పొరుగున ఉన్న సుక్మా జిల్లాలో 29 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అంతకుముందు, జనవరి 8న పొరుగున ఉన్న దంతెవాడ జిల్లాలో 63 మంది మావోయిస్టులు లొంగిపోగా, జనవరి 7న సుక్మాలో 26 మంది కార్యకర్తలు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి చేరారు. 2025లో రాష్ట్రంలో 1,500 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలించాలని కేంద్రం సంకల్పించింది.

## ఢిల్లీ అల్లర్ల కేసులో మరో నిందితుడి బెయిల్ పిటిషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ అల్లర్ల కేసు 2020 కేసులో నిందితుల్లో మరొక వ్యక్తి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుల్లో ఒకరు, కాల్ సెంటర్ మాజీ ఉద్యోగి అథర్ ఖాన్ అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్ ముందు ఈ బెయిల్ పిటిషన్ వేశారు. ఈ బెయిల్ పిటీషన్‌ను ఈ నెల 19కి కోర్టు విచారణకు జాబితా చేసింది. అథర్‌ఖాన్ రహస్య సమావేశాల్లో పాల్గొన్నాడని, విద్వేష పూర్వక ప్రసంగాలు చేశాడని, సీసీటీవీ కెమెరాల ధ్వంసానికి పాల్పడ్డాడని ఢిల్లీ పోలీసులు అభియోగాలు మోపారు. సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక సమావేశాల నిర్వాహకులు, వక్తలుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 మందిలో అథర్‌ఖాన్ ఒకరు. అలాగే, అల్లర్ల సమయంలో హెడ్ కానిస్టేబుల్ రతన్ లాల్‌ను మూక హత్య చేసిన గుంపులో అథర్‌ఖాన్ కూడా ఒకరిని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కాగా, ఇవే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు నిందితులు గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రెహమాన్, సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు సుప్రీంకోర్టు ఈ నెల ప్రారంభంలో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో అథర్‌ఖాన్ కూడా బెయిల్ దాఖలు చేశారు. ఈ నెల 6న ఇదే ఆరోపణలు ఎదుర్కొంటున్న జైల్లో ఉన్న మరొక నిందితుడు సలీం మాలిక్ కూడా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ అల్లర్ల కేసులో మొత్తం 20 మంది నిందితులు ఉన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఇరాన్ అశాంతికి బయటి శక్తుల ఆజ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** జఇరాన్ ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాల్లో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం?ఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి అగెస్ కాలమార్డ్, నిరసనలను అణిచివేయడానికి "త్వరిత విచారణలు, యాదచ్ఛిక ఉరిశిక్షలు" మళ్లీ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉమెన్, లైఫ్, ఫ్రీడం ఉద్యమం తరువాత చోటుచేసుకున్న సామూహిక ఉరిశిక్షలను ఆమె గుర్తు చేశారు. దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టుల నిజమైన పరిమాణాన్ని నిర్ధారించడం అసాధ్యంగా మారింది. అశాంతి వ్యాప్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణించారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబంధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంభించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ, నిరసనకారులకు ఉరిశిక్షలు అమలు చేస్తే "తీవ్ర చర్యలు" తీసుకుంటామని తెహ్రాన్‌కు హెచ్చరించారు. ఇరాన్‌లో "గెలవాలి" అనేదే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు, వేగవంతమైన, బలప్రయోగాత్మక

చర్యల సంకేతాలిచ్చారు. అయితే ఇవి మధ్యప్రాచ్యంపై అమెరికా దష్టిని తగ్గించాలని, ఇతర దేశాలపై రాజకీయ మార్పులు రుద్దకూడదని చెప్పిన కొద్ది వారాల క్రితమే విడుదలైన వాషింగ్టన్ జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. సెనేటర్ బెర్నీ శాండర్స్, అమెరికా సైనిక జోక్యం ఘోరమైన తప్పిదమని హెచ్చరిస్తూ, గత జోక్యాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. హింసాత్మక దమనాన్ని ఆపాలని, ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని, స్వేచ్ఛాయుత ఎన్నికలకు మద్దతు ఇవ్వాలని వాషింగ్టన్ కోరాలని ఆయన అభిప్రాయం. బాహ్య ఒత్తిడి ముఖ్యంగా సైనిక బెదిరింపులు తాము సహాయపడాలనుకునే ప్రజలకే నష్టం చేస్తాయన్న విస్తత ఆందోళనను ఇది ప్రతిబింబిస్తుంది.

## ఇన్ఫోసిస్ లాభం రూ.6,654 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికానికి (అక్టోబరు–డిసెంబరు) ఇన్ఫోసిస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.6,654 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024–25 ఇదే కాల లాభం రూ.6,806 కోట్లతో పోలిస్తే 2.2 శాతం తగ్గింది. కొత్త కార్మిక చట్టాలను (లేబర్ కోడ్) అమలు చేసేందుకు ఉద్యోగుల గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం 143 మి. డాలర్ల(దాదాపు రూ.1,289 కోట్లు)ను కేటాయించడం వల్లే లాభం తగ్గిందని కంపెనీ చెబుతోంది. ఈ కోడ్‌ల వల్ల వార్షికంగానూ సుమారు 15 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడొచ్చని తెలిపింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌లు కూడా వరుసగా రూ.2128 కోట్లు, రూ.718 కోట్ల మేర లేబర్ కోడ్ అమలుకు కేటాయించిన సంగతి విదితమే. ఇన్ఫీ కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.41,764 కోట్ల నుంచి 8.89 శాతం పెరిగి రూ.45,479 కోట్లకు చేరింది. 2025–26 జులై–సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరు– డిసెంబరులో సంస్థ నికర లాభం 9.6 శాతం తగ్గగా.. ఆదాయం 2.2 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్థిరకరెన్సీ రూపేణా ఆదాయ వృద్ధి అంచనాను 3– 3.5 శాతానికి పెంచింది. ఇంతకుముునుపు 2–3 శాతం వృద్ధిని అంచనా వేసింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తంగా 4.8 బిలియన్ డాలర్ల విలువైన పెద్ద కాంట్రాక్టులను దక్కించుకుంది. బ్రిటన్‌కు చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్ నుంచి అత్యధికంగా 1.6 బిలియన్ డాలర్ల కాంట్రాక్టును కంపెనీ పొందింది. కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్‌కు రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ (ఆర్ఎస్‌యూ) రూపంలో రూ.3 కోట్ల మార్కెట్ విలువ చేసే స్టాక్ ఇన్సెటివ్స్‌ను మంజూరు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అక్టోబరు–డిసెంబరులో రూ.18,000 కోట్ల బైబ్యాక్ ప్రక్రియను పూర్తి చేసింది. కంపెనీ చరిత్రలోనే ఇది అతి పెద్ద బైబ్యాక్.

## వాకీ టాకీ విక్రయాలు..
## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషోకు జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ–కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (అఅఖం) సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ–కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0–446.2 ఓఊళి బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో, జియో మార్ట్ తదితర ఈ–కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ఫైన్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

## కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సి స్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

## దాడి చేస్తే ప్రతీకారమే
## ట్రంప్‌నకు ఇరాన్ హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ దేశంపై అమెరికా దాడి చేస్తే ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దీనితో వాషింగ్టన్ ఓ అడుగు వెనక్కి వేసింది. అమెరికా మధ్యప్రాచ్యంలోని వైమానిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని బుధవారం అమెరికా అధికారవర్గాలు ధ్రువీకరించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఎదుర్కొంటున్న దేశీయ అశాంతిని అణచివేయడానికి ఇరాన్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారుల తరపున జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే బెదిరింపు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అమెరికాకు గట్టి సమాధానం ఇచ్చేందుకు టెహ్రాన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన ప్రాంతాల్లోని కీలక స్థావరాల నుంచి అమెరికా కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సైనిక జోక్యం జరిగే అవకాశం ఉందని యూరోపియన్ అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో దీనిపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ఓ ఇజ్రాయిల్ అధికారి తెలిపారు. అయితే దాని పరిధి, సమయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి
## నాటో సహాయం చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడంలో నాటో సహాయం చేయాలని , అమెరికన్ నియంత్రణ కంటే తక్కువ ఏదైనా ఆమోదయోగ్యం కాదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ చర్చల కోసం డానిష్ , గ్రీన్‌ల్యాండ్ అధికారులకు ఆతిథ్యం ఇవ్వడానికి కొన్ని గంటల ముందు పై విధంగా వ్యాఖ్యానించారు. ట్రంప్ తన సోషల్ మీడియా సైట్‌లో ఒక పోస్ట్‌లో.. అమెరికాకు "జాతీయ భద్రత కోసం గ్రీన్‌ల్యాండ్ అవసరం" అనే తన వాదనను పునరుద్ఘాటించారు. "మనం దానిని పొందడానికి నాటో దారి చూపాలి" , లేకుంటే రష్యా లేదా చైనా ఆధీనమే అంటూ పేర్కొన్నారు. "గ్రీన్‌ల్యాండ్ యునైటెడ్ స్టేట్స్ చేతుల్లో ఉండటంతో నాటో మరింత ప్రభావవంతంగా మారుతుంది" అని ట్రంప్ రాశారు. "అంతకంటే తక్కువ ఏదైనా ఆమోదయోగ్యం కాదు." అని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా వెనక్కి తగ్గాలని గ్రీన్‌ల్యాండ్ నివాసితులు కోరుకుంటున్నారు. నూక్‌లోని ఇరుకైన, మంచుతో కప్పబడిన ప్రధాన వీధి వెంబడి, అంతర్జాతీయ జర్నలిస్టులు , కెమెరా సిబ్బంది ప్రతి కొన్ని మీటర్ల (అడుగుల) గుండా వెళ్ళేవారిని ఆపుతున్నారు. ఇది నాటో ముగింపునకు దారితీస్తుందని డెన్మార్క్ ప్రధాన మంత్రి హెచ్చరించిన సంక్షోభంపై వారు ప్రశ్నిస్తున్నారు. 22 ఏండ్ల విద్యార్థిని టుటా మికాయెల్సెన్, నూక్‌లోని అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ, అమెరికన్ అధికారులు "వెనక్కి తగ్గేలా" సందేశాన్ని పొందుతారని తాను ఆశిస్తున్నానని చెప్పారు.

## ఇరాన్ గగనతలం మూసివేత?
## ఎయిరిండియా, ఇండిగో అడ్వైజరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** హింసాత్మక నిరసనల నేపథ్యంలో వాణిజ్య విమానాల రాకపోకలకు ఇరాన్ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. ఉద్రిక్తతల దృష్ట్యా కొన్ని విమానాలను దారి మళ్లిస్తున్నామని, మరికొన్ని సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఇరాన్ మీదుగా వెళ్లాల్సిన కొన్ని విమాన సర్వీసులను దారి మళ్లిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలు సాధ్యం కాని కొన్ని విమాన సర్వీసులను రద్దు చేస్తున్నాం. ప్రయాణికులు అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. కానీ.. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం" అని ఎయిరిండియా సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా ఇదే తరహా అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ గగనతలం మూసివేయడంతో కొన్ని అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడిందని తెలిపింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో సర్వీసులు నడుపుతున్నామని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు తమకు సహకరించాలని కోరింది.

## అలా భూమిని చేరడం ఇదే తొలిసారి



**హైదరాబాద్ పెన్ పవర్:** నాసా యొక్క క్రూ 11 బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి భూమికి తిరిగి చేరింది. ఒక వ్యోమగామి ఆరోగ్య సమస్యను ఎదుర్కొవడంతో ఈ మిషన్ చేపట్టినట్లు నాసా పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యొక్క 25 సంవత్సరాల చరిత్రలో వ్యోమగాములు ఆరోగ్య కారణాల వల్ల భూమికి తిరిగి రావడం ఇదే మొదటిసారి. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.11 గంటలకు కాలిఫోర్నియా తీరంలోని సముద్రంలో వారు సురక్షితంగా దిగారు. ఎలోన్ మస్క్ యొక్క స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక సహాయం కోసం అక్కడ ఉంది. ఈ చారిత్రాత్మక ల్యాండింగ్‌ను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. మిషన్ కమాండర్ సేనా మరియా కార్డ్‌మాన్, మిషన్ పైలట్ మైక్ ఫింకే (నాసా), మరియు మిషన్ స్పెషలిస్ట్‌లు కిమియా యుయి (జపాన్) మరియు ఒలేగ్ ప్లాటోనోవ్ (రష్యా)లతో కూడిన బృందం తిరిగి వచ్చింది. గత ఆగస్టులో స్టేషన్‌కు చేరుకున్న బృందంలో ఒకరికి ఆరోగ్య సమస్య ఉంది. అనారోగ్యంతో ఉందో లేదా అనారోగ్యం ఏమిటో అనే వివరాలు నాసా వెల్లడించలేదు.

# గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా ఫ్రాన్స్ రాయబార కార్యాలయం



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌ల్యాండ్‌కి మద్దతుగా రాయబార కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ఫ్రాన్స్ తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌కి మద్దతుగా ఫిబ్రవరి 6న అక్కడ తమ రాయబార కార్యాలయాన్ని ప్రారంభించనున్నామని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్–నోయెల్ బారోట్ పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని అమెరికా నుండి పదేపదే వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో ..ఆ దేశానికి మద్దతును ప్రకటించేందుకు ఇది ఒక నిర్దిష్ట చర్య కానుందని అన్నారు. సైన్యం జోక్యం చేసుకునే అవకాశం ఉందని సూచిస్తూ, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఫ్రాన్స్ మీడియాకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా పాలనకు, స్వాధీనంలో ఉండేందుకు, విలీనం కావడానికి గ్రీన్‌ల్యాండ్ ఇష్టపడదని అన్నారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) , యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్ పరిధిలోనే ఉండాలని ఈ ద్వీపం ఎంచుకున్నట్టు స్పష్టం చేశారు. అమెరికా వ్యాఖ్యలు అసంబద్ధమైనవి అని పేర్కొంటూ.. ఒక నాటో సభ్యుడు మరొకరిపై దాడి చేయడంలో అర్థం లేదని అన్నారు. ఇటువంటి చర్య అమెరికా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. అంతర్జాతీయ చట్టాలు తుంగలో తొక్కుతున్నారని, 2026 ప్రారంభంలో దేశాల మధ్య సంబంధాలను ఇప్పుడు బలమైన చట్టం నియంత్రిస్తోందని స్పష్టంగా చూపించాయని అన్నారు. అమెరికా ఒత్తిడి దృష్ట్యా డెన్మార్క్‌కు సంఘీభావాన్ని ప్రకటించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఇటీవలి రోజుల్లో ఫ్రాన్స్ అధికారులు తమ డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ సహచరులతో చర్చలు జరిపారని అన్నారు.

## థాయిలాండ్‌లో కూలిన మరో క్రేన్



**హైదరాబాద్ పెన్ పవర్:** థాయిలాండ్‌లో మరో క్రేన్ కూలిపోయింది. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసం కాగా, ఇద్దరు వ్యక్తులు మరణించారని గురువారం పోలీసులు తెలిపారు. క్రేన్ ప్రమాదంలో 32 మంది రైలు ప్రయాణికులు మరణించిన 24 గంటల్లోనే మరో క్రేన్ కూలడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది. తాజా సంఘటన రాజధాని బ్యాంకాక్ సమీపంలోని సముత్ సఖోన్ ప్రావిన్స్‌లో జరిగింది. అక్కడ ఎలివేటెడ్ హైవే నిర్మాణంలో పాల్గొన్న ఒక క్రేన్ రోడ్డుపై పడిపోయిందని స్థానిక జిల్లా పోలీస్ స్టేషన్ సూపరింటెండెంట్ పోలీస్ కల్నల్ సిత్తిపోర్న్ కాసి తెలిపారు. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు కూడా గాయపడ్డారని మరో పోలీసు అధికారి రాయిటర్స్‌తో చెప్పారు. థాయిలాండ్‌లో నిర్మాణ ప్రాజెక్టుల వల్ల సంభవించిన ప్రాణాంతక ప్రమాదాల శ్రేణిలో ఇది తాజాది. బుధవారం ఈశాన్య నఖోన్ రాట్చసిమా ప్రావిన్స్‌లో ఎలివేటెడ్ హై–స్పీడ్ రైలు ప్రాజెక్టులో పాల్గొన్న క్రేన్ కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 32 మంది మృతి చెందడంతో పాటు, రైలులోని 195 మంది ప్రయాణికుల్లో 66 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# బ్రిటన్ దౌత్యవేత్తను బహిష్కరించిన రష్యా



**హైదరాబాద్ పెన్ పవర్:** గూఢచర్యం ఆరోపణలతో మాస్కోలోని బ్రిటన్ దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించినట్లు రష్యా భద్రతాధికారులు వెల్లడించారు. మాస్కోలోని బ్రిటిష్ రాయబార కార్యాలయంలో కార్యదర్శిగా ఉన్న గారెత్ శామ్యూల్ డేవిస్ యూకేలోని (జఐ) రహస్య నిఘా సంస్థల కోసం పనిచేస్తున్నట్లు గుర్తించామని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఈూః) పేర్కొంది. దీంతో రెండు వారాల్లోగా రష్యాను వీడి వెళ్లిపోవాలని ఆయనకు సమన్లు జారీ చేసింది. రష్యా భూభాగంలో ఉంటూ.. జాతీయ భద్రతా విషయాలను విదేశాల నిఘా సంస్థలకు చేరవేయడాన్ని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని రష్యన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ చర్యలకు ప్రతిగా పరిస్థితులను తీవ్రతరం చేయడానికి యూకే ప్రభుత్వం ప్రయత్నిస్తే.. ప్రతీకార చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. ఇప్పటివరకూ లండన్, రష్యా మధ్య ఉన్న స్నేహపూర్వక చర్యల కారణంగా సదరు దౌత్యవేత్తపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. కాగా 2025లోనూ ఇదే విధంగా గూఢచర్యం ఆరోపణలతో మాస్కో ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను దేశం నుంచి సాగనంపింది.

## అదరగొట్టిన యూనియన్ బ్యాంక్ ఫలితాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.5,017 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.4,604 కోట్ల లాభాలతో పోల్చితే 9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన త్రైమాసికంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 1 శాతం పెరిగి రూ.9.328 కోట్లుగా నమోదయ్యింది. 2025 డిసెంబర్ త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 79 బేసిస్ పాయింట్లు తగ్గి 3.06 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 31 బేసిస్ పాయింట్లు తగ్గి 0.51 శాతానికి పరిమితమయ్యాయి. బ్యాంక్ మొత్తం వ్యాపారం 5.04 శాతం పెరిగ్గా.. స్థూల అడ్వాన్సుల్లోనూ 7.13 శాతం వృద్ధి చోటు చేసుకుంది. మొత్తం డిపాజిట్లు 3.36 శాతం పెరిగాయి. 2025 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.22,39,740 కోట్లకు చేరింది. ఆ బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 3.36 శాతం పెరిగి రూ.12,22,856 కోట్లుగా నమోదయ్యాయి. ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బుధవారం బిఎస్ఇలో యూనియన్ బ్యాంక్ బ్యాంక్ షేర్ ఓ దశలో రూ.180ని తాకింది. తుదకు 7.7 శాతం లాభంతో రూ.178.8 వద్ద ముగిసింది. 2023 మార్చి తర్వాత ఒక్క పూటలో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. గడిచిన ఏడాది కాలంలో యూనియన్ బ్యాంక్ షేర్ 70 శాతం లాభాలను అందించింది.

## విదేశీ వాణిజ్యంలో చైనా రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గతేడాది చైనా వాణిజ్యంపై అనేక ఆంక్షలు పెట్టడంతో పాటుగా భారీగా టారిఫ్‌లను పెంచినప్పటికీ రికార్డ్ విదేశీ వాణిజ్యాన్ని నమోదు చేసింది. 2025లో చైనా వస్తువుల విదేశీ వాణిజ్యం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం పెరిగి 45.47 ట్రిలియన్ యువాన్లకు (6.51 ట్రిలియన్ డాలర్ల) చేరుకుంది. ఇది సరికొత్త రికార్డును సృష్టించడమే కాకుండా, బలమైన వాణిజ్యానికి నిదర్శనమని చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ వెల్లడించింది. గత ఏడాది కూడా ప్రపంచంలోనే అతిపెద్ద వస్తువుల వాణిజ్య దేశంగా చైనా తన స్థానాన్ని నిలబెట్టుకుందని పేర్కొంది. 2025లో చైనా ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 6.1 శాతం పెరిగి 26.99 ట్రిలియన్ యువాన్లకు చేరుకోగా, దిగుమతులు 0.5 శాతం పెరిగి 18.48 ట్రిలియన్ యువాన్లుగా నమోదయ్యాయి. ''అంతర్జాతీయ వాతావరణం తీవ్రమైన మార్పులకు లోనవుతూ, ప్రపంచ ఆర్థిక, వాణిజ్య క్రమం ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటున్న సంక్లిష్ట పరిస్థితుల్లోనూ చైనా విదేశీ వాణిజ్య రంగం సాధించిన విజయాలు అసాధారణమైనవి. ఎంతో కష్టపడి సాధించినవి.'' అని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ (జీఏసీ) డిప్యూటీ హెడ్ వాంగ్ జున్ పేర్కొన్నారు. సంక్లిష్టమైన బాహ్య వాతావరణం నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ సాధించిన ఈ విజయాలు.. చైనా విదేశీ వాణిజ్య సంస్థల నాణ్యతలో మెరుగుదలని, ఉత్పత్తుల పోటీతత్వాన్ని, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా మారే సామర్థ్యాన్ని పూర్తిగా నిరూపిస్తాయని చైనీస్ అకాడమీ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ రీసెర్చ్ ఫెలో బాయి మింగ్ తెలిపారు.

## హైదరాబాద్‌లో రిచెస్ట్ పర్సన్స్ వీళ్ళే!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలోనే అత్యంత ధనికులు ఎక్కువగా ఉన్న నగరాల్లో ఒకటిగా నిలుస్తోంది. 2025-2026 సంవత్సరాలకు సంబంధించిన హురున్ ఇండియా రిచ్ లిస్ట్, ఫోర్బ్స్ ఇండియా హైదరాబాద్‌లోని ధనికుల జాబితా విడుదల చేసింది. వీరి అంచనాల ప్రకారం.. డివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన మురళి దివి కుటుంబం సుమారు రూ.91,100 కోట్ల నెట్ వర్త్‌తో హైదరాబాద్‌లోనే అత్యంత రిచెస్ట్ పర్సన్ గా ఉన్నారు. రెండవ స్థానంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఓఇఎఒ)కు చెందిన పి. పిచ్చి రెడ్డి రూ.42,650 కోట్లు, మూడవస్థానంలో పి.వి. కృష్ణ రెడ్డి రూ.41,810 కోట్లు, నాలుగవ స్థానంలో హెటెరో ల్యాబ్స్‌కు చెందిన బి. పార్థసారధి రెడ్డి రూ.39,030 కోట్లు, ఐదవ స్థానములో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన కే. సతీష్ రెడ్డి కుటుంబం రూ.39,000 కోట్లు, 6వ స్థానంలో రూ.35,000 కోట్లతో ఔరోబిందో ఫార్మాకు చెందిన పి.వి. రామ్‌ప్రసాద్ రెడ్డి, బయాలజికల్ ఈ సంస్థను నడిపిస్తున్న మహిమ దత్ల ఉన్నారు. 7వ స్థానంలో సోలార్ ఎనర్జీ రంగంలో ప్రీమియర్ ఎనర్జీస్‌కు చెందిన సురేందర్ సలూజా కుటుంబం, 8వ స్థానంలో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన జూపల్లి రామేశ్వర్ రావు, తరువాతి స్థానాల్లో అపర్ణ కన్స్ట్రక్షన్స్‌కు చెందిన సుబ్రమణ్యం రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి నిలిచారు. మొత్తంగా చూస్తే హైదరాబాద్‌లో ధనికులు ఎక్కువగా ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్, సోలార్ ఎనర్జీ రంగాల నుంచి ఎదిగినవారే ఉండటం గమనార్హం. అంతేకాదు తాజా అంచనాల ప్రకారం హైదరాబాద్‌లో రూ.1,000 కోట్లు పైగా ఆస్తులు కలిగిన వారు 100 మందికి పైగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇది దేశంలో ముంబై, ఢిల్లీ తర్వాత మూడో స్థానంలో హైదరాబాద్ నిలవడం విశేషం.

## అశ్లీల డీప్‌ఫేక్‌లకు చెక్..

## గ్రోక్ ఏఐపై 'ఎక్స్' కఠిన ఆంక్షలు




**హైదరాబాద్ పెన్ పవర్:** రోజుల క్రితం సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ అయిన ఎక్స్‌లో గ్రోక్ ఏఐ సాయంతో అశ్లీల కంటెంట్ ఫీచర్ అందుబాటులో ఉంది. దీంతో ఎక్స్ వేదికగా ప్రముఖుల ఫొటోలను అశ్లీలంగా మార్చి పోస్టులు చేశారు.దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం, ప్రసార మంత్రిత్వ శాఖ తీవ్ర స్థాయిలో స్పందించి ఎక్స్ కు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్', తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ 'గ్రోక్' ద్వారా అసభ్యకరమైన ఏఐ చిత్రాల సృష్టిని అడ్డుకోవడానికి సాంకేతిక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా నిజమైన వ్యక్తులను తక్కువ దుస్తుల్లో చూపేలా రూపొందించే డీప్‌ఫేక్ చిత్రాల వల్ల ఎదురైన తీవ్ర విమర్శల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. అశ్లీల చిత్రాల సృష్టి చట్టవిరుద్ధమైన దేశాల్లో, ప్రాంతాల్లో, వ్యక్తులను బికినీలు, లోదుస్తులతో ఉన్నట్లుగా ఏఐ చిత్రాలను తయారు చేసే సదుపాయాన్ని 'జియోబ్లాక్' చేస్తున్నట్లు ఎక్స్ ప్రకటించింది. ఈ ఆంక్షలు పెయిడ్ సబ్‌స్క్రైబర్లతో సహా వినియోగదారులందరికీ వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. అంతేకాకుండా, గ్రోక్ ద్వారా చిత్రాలను సృష్టించడం, వాటిని ఎడిట్ చేసే సదుపాయాన్ని ఇకపై కేవలం పెయిడ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే పరిమితం చేసింది. ప్లాట్‌ఫామ్ నిబంధనలను ఉల్లంఘించే వారు, చట్టవిరుద్ధమైన పనులకు ఏఐని వాడుకునే వారిని గుర్తించి, బాధ్యులను చేసేందుకు ఈ నిబంధన అదనపు రక్షణ కవచంగా పనిచేస్తుందని ఎక్స్ తన 'సేఫ్టీ' హ్యాండిల్ ద్వారా వెల్లడించింది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇతరుల ప్రైవసీకి భంగం కలిగించే చర్యలపై ఇకపై కఠినంగా వ్యవహరించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

# ఆముదం నూనె సీక్రెట్..



